ప్రజా పక్షం.. ప్రజా గొంతు..

జయ జయహే

# సూర్యోదయం

కరీంనగర్ | సంపుటి -5 | సంచిక -155 | పేజీలు : 8 | ఎడిటర్ : శివకృష్ణ | మంగళవారం 16 సెప్టెంబర్ 2025 | వెల : 4/-






## మెట్రో మాకొద్దు!

- అప్పులు, అధిక వడ్డీలను భరించలేకపోతున్నాం
- పెరిగిన నిర్మాణ వ్యయాన్నీ మాకు ఇవ్వడం లేదు
- 6000 కోట్లిస్తే ప్రాజెక్టు నుంచి తప్పుకొంటాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎల్అండ్‌టీ లేఖ
- బకాయిలతోనే ఆర్థిక సంక్షోభమని వెల్లడి
- 2024-25లో మెట్రో ఆదాయం1108 కోట్లు
- భూములను సద్వినియోగం చేసుకుంటే ఆదాయంవచ్చి ఉండేదని నిపుణుల వ్యాఖ్య

హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రెండో దశను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతోంది. దాంతో, మొదటి దశను కూడా మీరే తీసేసుకోండని మెట్రో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. తమకు రూ.6,000 కోట్లను సర్దుబాటు చేస్తే ప్రాజెక్టు నుంచి పూర్తిగా తప్పుకొంటామని ప్రతిపాదించింది. అప్పుల భారం పెరుగుతోందని, - మిగతా2లో

# వీధి దీపాలపై పక్కాగా లెక్క



- అవసరమైన టెండర్లు పిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లను బిగించి, వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామాల్లో పంచాయతీలకు అప్పగించాలి
- మండలస్థాయిలో ఎంపీడీవోలకు, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లకు అప్పగించి పర్యవేక్షించాలి
- "ఇప్పుడున్న వీధిదీపాలను సమర్థంగా వినియోగించుకోవాలి
- అవన్నీ రాత్రిపూట పక్కాగా పనిచేయడంతోపాటు పగటిపూట వెలగకుండా చూసి తద్వారా విద్యుత్ వృథాను అరికట్టాలి.

హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పురపాలక సంఘాల్లో వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లను బిగించి, వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామాల్లో పంచాయతీలకు అప్పగించాలని సూచించారు. సంబంధిత డాష్ బోర్డులను మండలస్థాయిలో ఎంపీడీవోలకు, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లకు అప్పగించి పర్యవేక్షించాల న్నారు. రాష్ట్రంలో వీధిదీపాల పనితీరుపై సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్



### దేశంలోని చొరబాటుదారులను

## వెనక్కి పంపుతాం

- రాష్ట్రీయ జనతా దళ్ కాంగ్రెస్ పార్టీలు రెండూ బిహార్ ఐడెంటిటీని ప్రమాదంలో పడేస్తున్నాయి
- ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో బిహార్ ఇబ్బందుల పాలైంది
- బిహార్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, ఆర్జేడీ ఓర్వలేకున్నాయి
- సొంత కుటుంబాల గురించి మాత్రమే ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తారు

3

# 'ఫీజు' చర్చలు సఫలం



- ఫీజు బకాయిల్లో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేస్తామన్న ప్రభుత్వం
- మిగతా బకాయిలు భవిష్యత్తులో ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- అంగీకరించిన కాలేజీల యాజమాన్యాలు.. సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్న సర్కారు

హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఎట్టకేలకు ఫలప్రదమయ్యాయి. ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన మొత్తంలో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన బకాయిలను భవిష్యత్తులో చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కాగా సమ్మె విరమిస్తున్నట్టు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు తెలిపారు. - మిగతా2లో



## వక్ఫ్ చట్టానికి పాక్షికంగా బ్రేక్

- వివాదాస్పద నిబంధనలపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- ఐదేళ్లపాటు ఇస్లాం పాటించాలన్న నిబంధన నిలిపివేత
- వక్ఫ్ ఆస్తిలో కలెక్టర్ల జోక్యం నిలుపుదల

3



## దీర్ఘకాలిక వ్యాధుల పంజా

- భారత్‌లో పెరిగిన మరణాల ముప్పు!
- పురుషులు, మహిళలు.. ఇద్దరిలోనూ ముప్పు
- గుండె జబ్బులు, మధుమేహం ప్రధాన కారణం
- పురుషులతో పోలిస్తే మహిళల్లో ముప్పు మరింత ఎక్కువ

3

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2



### జిన్‌పింగ్ అలా..

## మోదీ ఇలా..

### ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు దీటైన జవాబిచ్చిన చైనా

- సుంకాలకు ప్రతిచర్య ఉంటుందని నాటో, జీ7కు హెచ్చరిక
- భారత్‌పై సుంకాలతో పాటు నోరు పారేసుకొన్న ట్రంప్
- డెడ్ ఎకానమీ అని, పాక్ దగ్గర చమురు కొనాలని హేళన
- నాటో, జీ7 దేశాలను ఉసిగొల్పుతూ టారిఫ్‌లకు యత్నం
- అయినప్పటికీ, ఇంతవరకూ నోరు తెరవని ప్రధాని మోదీ

వివరాలు 3లో..

# ఆరోగ్యశ్రీ సేవలపై గందరగోళం




### నేటి అర్ధరాత్రి నుంచి సేవలు బంద్ చేస్తామన్న ఆస్పత్రులు

- బకాయిల్లోరూ.100 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- బంద్ కొనసాగింపుపై యాజమాన్యాల్లో భిన్నాభిప్రాయాలు
- సేవలు నిలిపివేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడి ప్రకటన

హైదరాబాద్,

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలపై గందరగోళం నెలకొంది. బకాయిలు చెల్లించని కారణంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలను నిలిపివేస్తున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వెలువడిన తర్వాత సోమ వారం ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేయడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు పునరాలోచనలో పడినట్లు తెలిసింది. కొన్ని యాజమాన్యాలు బంద్ కొనసాగించాలని భావిస్తుండగా, ప్రభుత్వంతో గొడవ ఎందుకు అనే ధోరణిలో మరికొన్ని యాజమాన్యాలు ఉన్నట్లు సమాచారం. అయితే అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ మాత్రం మంగళవారం అర్ధరాత్రి నుంచి సేవలు నిలిపివేస్తామని తెలిపారు.

రూ.100 కోట్లు ఇస్తే ఎలా?: ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించని ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 1 నుంచి సేవలు నిలిపివేస్తున్నట్టు గత నెల 25న నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. అయితే ప్రభుత్వం పిలిపించి మాట్లాడడంతో పాటు బకాయిలు చెల్లిస్తామంటూ హామీ ఇవ్వడంతో సేవల నిలిపివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అయితే నెల - మిగతా2లో

# మెట్రో మాకొద్దు!

-మొదటిపేజీ తరువాయి

మెట్రోను తాము నిర్వహించే పరిస్థితి ఇక లేదని స్పష్టం చేసింది. మెట్రో మొదటి దశలోని తమ ఈక్విటీ వాటాను కేంద్రం లేదా రాష్ట్రానికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అయితే, మెట్రో నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకొంటామని ఎల్అండ్టీ చెబుతుండడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ రెండు మూడుసార్లు ఇటువంటి ప్రకటనలే చేసింది. అయితే, ఈసారి కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి జైదీపకు ఇటీవల లేఖ రాసింది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తి చేసింది. మొదటి దశలో చేపట్టిన మూడు కారిడార్లను కేంద్రానికి లేదా రాష్ట్రానికి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి అప్పగించాలని సూచించినా తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఇదే విషయాన్ని వారం రోజుల కిందట సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వెల్లడించింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో టికెట్లు, ప్రకటనలతో వచ్చే ఆదాయం నిర్వహణకు సరిపోవడం లేదని, వడ్డీలు, విద్యుత్తు చార్జీలు, ఉద్యోగుల జీతభత్యాలు భారంగా మారాయని పేర్కొన్నట్లు తెలిసింది. మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్కారు కోరుతున్న సమయంలో మొదటి దశ నుంచి తాము తప్పుకొంటామని ఎల్అండ్టీ లేఖ రాయడం గమనార్హం. అప్పులు, అధిక వడ్డీలను సమస్యగా చూపిస్తూ.. మెట్రో ప్రాజెక్టు నుంచి తప్పుకొంటామని ప్రతిపాదిస్తోంది. జాప్యంతో పెరిగిన నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వాలు సర్దుబాటు చేయకపోవడమూ కారణమని చెబుతున్నారు.

**నష్టాలు నిజమేనా..!?**

హైదరాబాద్ మెట్రోలోని మూడు కారిడార్లలో ప్రస్తుతం రోజుకు దాదాపు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. మన దగ్గర కనీస చార్జీ రూ.11 కాగా.. గరిష్ఠ చార్జీ రూ.69గా ఉంది. మిగిలిన మెట్రోలతో పోలిస్తే మన దగ్గరే చార్జీలు కాస్త ఎక్కువనే విమర్శ కూడా ఉంది. ఇక, మెట్రో నిర్వహణ అంటే.. టికెట్ చార్జీలు, యాడ్ల ఆదాయం లాభదాయకంగానే ఉన్నప్పటికీ అప్పులు, అధిక వడ్డీలతోనే తమకు నష్టాలు వస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. నిజానికి, హైదరాబాద్‌లో 2012లో మెట్రో మొదటి దశ ప్రాజెక్టును చేపట్టారు. తొలుత రూ.14,132 కోట్లతో ప్రతిపాదించిన పనుల ఖర్చు 2017లో ప్రాజెక్టు (ఎల్బీ నగర్–మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్, నాగోల్–రాయదుర్గం కారిడార్లు.. మొత్తం 69.2 కిలోమీటర్లు) పూర్తయ్యేసరికి రూ.22 వేల కోట్లకు చేరింది. దాంతో, పనులను పూర్తి చేసేందుకు ఎల్అండ్టీ వివిధ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చింది. ప్రస్తుతం రూ.15,920.23 కోట్ల ఆస్తులున్న మెట్రోకు మొదటి దశలో రూ.8,148.07 కోట్ల అప్పులున్నాయి. మెట్రో నిర్మాణానికి తొలుత ప్రతిపాదించిన రూ.14,132 కోట్లలో ఎల్అండ్టీ రూ.9,892 కోట్లను పది బ్యాంకుల నుంచి 7–10 శాతం వడ్డీకి రుణం తీసుకుంది. తన వాటాగా 20 శాతం అంటే రూ.2,826 కోట్లను సమకూర్చింది. కేంద్రం 1,413 కోట్లను వీజీఎఫగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే, బ్యాంకుల నుంచి దాదాపు పది శాతం వడ్డీకి అప్పులు తీసుకొచ్చామని, వాటికి వడ్డీలు కట్టడం భారంగా మారిందని ఇప్పుడు ఎల్అండ్టీ చెబుతోంది. ప్రాజెక్టు నుంచి తాము తప్పుకోవడానికి ఇదే ప్రధాన కారణంగానూ వివరిస్తోంది. నిజానికి, మెట్రో నిర్వహణ వ్యయం ఏడాదికి దాదాపు రూ.400 కోట్లు. కాగా.. 2024–25లో హైదరబాద్ మెట్రోకు మొత్తం రూ.1,108.54 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో టికెట్ చార్జీల ద్వారా వచ్చిన ఆదాయమే రూ.627.11 కోట్లు. వెరసి, నిర్వహణ వ్యయం పోను మొదటి దశ నిర్మాణానికి చేసిన అప్పులకు ఇప్పటి వరకు రూ.4,500 కోట్ల వడ్డీలు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.

**రూ.4 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం**

హైదరాబాద్ మెట్రోను 2014 నాటికే పూర్తి చేయాల్సి ఉంది. అప్పట్లో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం రెండు అలైన్‌మెంట్లను మార్చాలని సూచించింది. అలైన్‌మెంట్‌లో మార్పులతో నిర్మాణంలో జాప్యం చోటు చేసుకుంది. దాంతో, నిర్మాణ వ్యయమూ పెరిగింది. వెరసి, నిర్మాణంలో జాప్యం కారణంగా 2017 నాటికే రూ.3,756 కోట్ల నష్టం జరిగిందని, దానిని సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ భారం 2020 నాటికి రూ.5000 కోట్లకు చేరిందని మెట్రో అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనికితోడు, కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూ.254 కోట్లూ ఇవ్వట్లేదు. ఈ నేపథ్యంలోనే నిర్వహణ నుంచి తప్పుకోవాలని ఎల్అండ్టీ చూస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, టికెట్లు, యాడ్ల ద్వారా మాత్రమే కాకుండా రియల్ ఎస్టేట్ ద్వారా మెట్రో రూ.4000 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. నిజానికి, మెట్రో కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఎల్అండ్టీకి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు మార్గాల్లో ఆదాయానికి అవకాశం చ్చింది. ఒకటి, టికెట్ల ద్వారా 50% ఆదాయార్జన. రెండోది.. యాడ్స్ ద్వారా 5% ఆదాయం. మూడోది.. అత్యంత కీలకమైనది రియల్ ఎస్టేట్. మెట్రోకు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 269 ఎకరాలను ఇచ్చింది. 60 ఏళ్లపాటు ఈ ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుని నిర్వహణను చేపట్టాలని ఒప్పందం చేసుకున్నారు. వీటిలో ఆఫీసు స్పేస్‌లను, షాపింగ్ మాల్స్ నిర్వహణ ద్వారా ఆదాయాన్ని సాధించడం. దాంతో, హైటెక్ సిటీ, ఎర్రమంజిల్, పంజాగుట్ట, మూసారాంబాద్ ప్రాంతాల్లో 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు మాల్స్ నిర్మించింది. వీటిని సబ్ లైసెన్స్‌కు ఇచ్చి రూ.3000 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, రాయదుర్గంలోని 15 ఎకరాలను రూ.1045 కోట్లకు సబ్ లీజుకు ఇచ్చింది. ఇందులో 2023లో ఎల్అండ్టీకి రూ.512 కోట్లు వచ్చాయి. మిగిలిన మొత్తం రావాల్సి ఉంది. నిజానికి, రవాణా ఆధారిత అభివృద్ధి కింద ఇచ్చిన 269 ఎకరాల్లో ఇప్పటి వరకు 50 శాతం భూములను కూడా మెట్రో సద్వినియోగం చేసుకోలేదని తెలుస్తోంది. మెట్రో ఆర్థిక సంక్షోభానికి ఇది ప్రధాన కారణంగా ఆ సంస్థ అధికారులే చెబుతున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ అధీనంలోనే..**

హైదరాబాద్‌లోనే కాకుండా ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి, లఖ్‌నవూ, నాగ్‌పూర్, పుణె, అహ్మదాబాద్‌ల్లో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. వీటన్నిటినీ అక్కడి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే చేపట్టారు. వాటినిర్వహణ కోసం ప్రత్యేక కార్పొరేషన్లు (ఎస్పీవీ) ఏర్పాటు చేశారు. వీటిలో అత్యధికం లాభాల బాటలోనే పయనిస్తున్నాయని వాటి గణాంకాలు చెబుతున్నాయి. మరికొన్ని వ్యవస్థలు నష్టాల్లో కొనసాగుతున్నా.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు దానిని భారంగా పరిగణించడం లేదు. దానిని వాణిజ్యపరంగా చూడకుండా ప్రజా రవాణా మెరుగుపరిచే సామాజిక అవసరంగా చూస్తున్నాయి. కొవిడ్ సమయంలో హైదరాబాద్ మెట్రోకు మాత్రమే కాకుండా వాటికి కూడా నష్టాలు వచ్చాయి. అయినా, వాటిని సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. హైదరాబాద్ మెట్రోను పీపీపీ మోడల్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా దానికి ప్రభుత్వ భూములను కూడా ఇచ్చారు. దాదాపు 90 శాతం నిధులను బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్నారు. భూములను సద్వినియోగం చేసుకోకపోవడమే మెట్రో ప్రస్తుత పరిస్థితికి కారణమని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ఇక, మెట్రో వసూలు చేస్తున్న అద్దెలూ ఎక్కువనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు, రాయదుర్గం రహేజా మైండ్ స్పేస్‌లో చదరపు గజానికి రూ.30 వేల అద్దె విధించడంతో చాలామంది ముందుకు రావడం లేదని చెబుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా.. కొత్త రైళ్లు, అదనపు బోగీలను ఏర్పాటు చేయకపోవడం మరో ప్రధాన లోపంగా వివరిస్తున్నారు.

# నగరంలో ట్రా'ఫికర్'

కరీంనగర్



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వాహనాల రద్దీరోజురోజుకు పెరుగుతోంది. నగరం స్మార్ట్‌సిటీ కావడమేకాకుండా శివారులోని పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, సదాశివపల్లి, అల్గునూర్‌తోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీ నగరపాలక సంస్థలో విలీనమయ్యాయి. నగర విస్తీర్ణం, జనాభాతోపాటు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఒకపుడు ప్రధాన రహదారులకే పరిమితమైన వాహనాల రద్దీ, ఇప్పుడు అంతర్గత రోడ్లలో కూడా ఏర్పడింది.

**యథేచ్ఛగా ఆక్రమణలు**

ప్రధాన రోడ్లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని దర్జాగా ఓవైపు పండ్లు, మిర్చి బండ్లు, టిఫిన్, పానీపురి బండ్లు, ఇతర చిరువ్యాపారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. చాలా చోట్ల దుకాణదారులు వారి దుకాణాలకు సంబంధించిన బోర్డులను, కొంత మంది అమ్మకాలకు సంబంధించిన వస్తువులను ఫుట్‌పాత్, రోడ్లపై పెడుతున్నారు. దీనికితోడు ఆయా దుకాణాలకు, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు వచ్చే వారు వాహనాలను రోడ్లపైనే నిలిపివేయడంతో రోడ్లు చాలా చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిపి విద్యార్థులను తీసుకెళ్లడం, వదిలిపెడుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

**ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్**

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపైనే స్కూల్స్, ఫంక్షన్ హాల్స్‌తోపాటు వైన్ షాపులు, మద్యం దుకాణాలకు కూడా అనుమతి ఇవ్వడంతో వాటికి పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓవైపు ద్విచక్రవాహనాలు, మరోవైపు స్కూల్‌బస్సుల, ఇంకోవైపు ఆటోలు, కార్లు ఇలా రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు ఇప్పటికే మంకమ్మతోట పాత లేబర్ అడ్డా, కమాన్ జంక్షన్, విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం, ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్ ఎదుట ఉన్న రోడ్లను వన్‌వేగా మార్చారు.

**బిజీగా మారిన యూనివర్సిటీ రోడ్డు**

శాతవాహన యూనివర్సిటీ రోడ్డులో గత ఏడాది నగరపాలక సంస్థ నైట్ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. దీంతో ఇక ఆ రోడ్డు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బిజీగా మారింది. ఓవైపు వాహనాల రద్దీ, మరోవైపు కొంత మంది యువకులు సాయంత్రం, రాత్రి వేళల్లో చెవులు చిల్లులు పడే విధంగా శబ్దంతో బైక్ రైడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులేకాకుండా పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ రోడ్డు, కట్టరాంపూర్, హనుమాన్‌నగర్‌రోడ్డు, హౌసింగ్‌బోర్డుకాలనీ రోడ్డు, కాపువాడ రోడ్డు, భగత్‌నగర్, రాంచంద్రాపూర్ కాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్ల మధ్య డివైడర్లు లేక పోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై నగరపాలక సంస్థ, పోలీస్ శాఖలు అధ్యయనం చేసి ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణకు స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. సైలెన్సర్లు మార్చి నడిపే బైకులను, బైక్ రేస్‌లను నియంత్రించాలని రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలపై గందరగోళం

-మొదటిపేజీ తరువాయి

మొదటి వారంలో ప్రభుత్వానికి సంబంధించిన ఇతర చెల్లింపుల నేపథ్యంలో ఆరోగ్యశ్రీ బకాయిల విడుదల కుదర్లేదు. దీంతో హాస్పిటల్స్ అసోసియేషన్ తాజాగా మరోసారి అల్టిమేటం ఇచ్చింది. అయితే ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేయడంతో ఏం చేయాలనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రూ.1,400 కోట్ల బకాయిలు ఉంటే రూ.100 కోట్లు ఇస్తే ఎలా అని డాక్టర్ రాకేష్ ప్రశ్నించారు.

## వీధి దీపాలపై పక్కాగా లెక్క

-మొదటిపేజీ తరువాయి

కేంద్రంలో నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఇప్పుడున్న వీధిదీపాలను సమర్థంగా వినియోగించుకోవాలి. అవన్నీ రాత్రిపూట పక్కాగా పనిచేయడంతోపాటు పగటిపూట వెలగకుండా చూసి తద్వారా విద్యుత్ వృథాను అరికట్టాలి. అవసరమైన చోట కొత్తవి బిగించండి. పోల్ సర్వే చేపట్టి... అసలెన్ని దీపాలు అందుబాటులో ఉన్నాయి... కొత్తగా ఎన్ని అవసరం పడతాయో పక్కాగా లెక్కలు వేయండి. లైట్ల పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. ఇందుకోసం కృత్రిమమేధను వినియోగించుకోండి. హైదరాబాద్ ఐఐటీలాంటి సంస్థలతో థర్డ్‌పార్టీ ఆడిటింగ్ చేయిస్తుండాలి" అని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 16.16 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలు ఉన్నాయని, వీటిలో వరంగల్, నల్గొండ, జనగామ, నారాయణపేట జిల్లాల్లో వీధిదీపాల కాంట్రాక్టు ఏజెన్సీల ఆధ్వర్యంలో ఉన్నాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఎల్ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. "జీహెచ్ఎంసీ పరిధిలో 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నా. ఓఆర్ఆర్ పరిధిలోని కోర్ అర్బన్ సిటీలో ఇంకా 7.50 లక్షల దీపాలు అవసరం అవుతాయి. గతంలో ఉన్న ఏజెన్సీల కాంట్రాక్టు ముగియడంతో ఇప్పుడు చాలాచోట్ల దీపాలు వెలగడంలేదు. నిర్వహణ కూడా సరిగ్గాలేదు" అని అధికారులు వెల్లడించారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల బిగింపు, ఏడేళ్ల వరకు వాటి నిర్వహణ బాధ్యతను పేరొందిన కంపెనీలకు అప్పగించేలా టెండర్లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధిదీపాల విద్యుత్తు బిల్లుల కోసం ప్రతినెలా రూ.8 కోట్లు చెల్లిస్తున్నామని, దీన్ని ఆదా చేసేందుకు సౌర విద్యుత్తు వినియోగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అన్ని మున్సిపాల్టీల్లోనూ ఎల్ఈడీ లైట్లను బిగించేందుకు కూడా టెండర్లు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరందర్‌రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజ్, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, ఆ శాఖ కమిషనర్ సృజన, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ కార్యదర్శి ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

హైదరాబాద్

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలు, ప్రత్యేక వెబ్‌సైట్‌ను వెంటనే రూపొందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం హౌంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, సీపీఆర్వో మల్సూర్‌లతో కలిసి జర్నలిస్టుల అక్రిడిటేషన్, హెల్త్ పాలసీ తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. హైపవర్ కమిటీని పునరుద్ధరించాలి. జర్నలిస్టుల జీతభత్యాలకు సంబంధించిన త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్ధరిస్తాం. హెల్త్ పాలసీపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలి" అని పొంగులేటి పేర్కొన్నారు. జర్నలిస్టుల అవార్డులను పునరుద్ధరించాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఫీజు' చర్చలు సఫలం



-మొదటిపేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీలు దాదాపు ఏడాదిగా ఆందోళన చేస్తున్నాయి. గత ఏడాది పరీక్షలు కూడా బహిష్కరిస్తామని హెచ్చరించాయి. అయితే అప్పట్లో అధికారులు నచ్చజెప్పారు. కానీ బకాయిలు విడుదల కాకపోవడంతో తాజాగా సోమవారం నుంచి అన్ని కాలేజీలను బంద్ చేస్తున్నట్టు యాజమాన్యాలు నోటీసు ఇచ్చాయి. దీంతో ప్రభుత్వం వారిని చర్చలకు ఆహ్వానించింది. ఆదివారం మొదలైన చర్చలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. తర్జనభర్జనలు, వాదోపవాదాల తర్వాత ఎట్టకేలకు చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. అనంతరం మంత్రులు, యాజమాన్య సంఘాల ప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు.

**ఇది మాకెంతో ప్రాధాన్యతాంశం: డిప్యూటీ సీఎం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యధిక ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. పేద వర్గాల విద్యకు చేయూతనిచ్చే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, దీన్ని తాము కొనసాగిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసిందని, బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. వారు వారసత్వంగా ఇచ్చిన బకాయిలు తమకు భారంగా మారాయన్నారు. అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలేజీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపామని, చర్చలు సానుకూలంగా ముగిసాయని తెలిపారు. ప్రభుత్వానికి సహకరించి సమ్మె విరమించిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ కమిటీని వేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించామని, త్వరలోనే ఆదేశాలు వెలువడతాయని వెల్లడించారు. హేతుబద్ధీకరణలో యాజమాన్యాలు, మేధావుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

**డిగ్రీ, పీజీ కాలేజీల అసంతృప్తి!**

చర్చలపై ఇంజనీరింగ్ కాలేజీలు సంతృప్తి వ్యక్తం చేస్తే పీజీ, డిగ్రీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు మాత్రం అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మీడియా సమావేశానికి కూడా వారు దూరంగా ఉన్నారు. తమ బకాయిల విషయంలో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదని, కాలేజీలు నడపాలా? సమ్మెకు వెళ్లాలా? అనే దానిపై మంగళవారం నిర్ణయం తీసుకుంటామని ఆయా కాలేజీల ప్రతినిధులు తెలిపారు. చర్చల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక వ్యాధుల పంజా..

ఇంటర్నెట్ డెస్క్

భారత్‌లో దీర్ఘకాలిక వ్యాధులు పంజా విసురుతున్నట్లు తెలుస్తోంది. దేశంలో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో మరణించే అవకాశాలు పెరిగాయి. పురుషులు, మహిళలు.. ఇద్దరిలోనూ ముప్పు పెరిగింది. 185 దేశాలను పరిగణనలోకి తీసుకుని బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ లండన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశాల వారీగా దీర్ఘకాలిక వ్యాధులతో ముడిపడి ఉన్న మరణాల రేటును ట్రాక్ చేసిన ఈ మొట్టమొదటి ప్రపంచస్థాయి అధ్యయనం.. లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైంది.
2010–19 మధ్యకాలంలో దీర్ఘకాలిక వ్యాధులతో మహిళలు మరణించే సంభావ్యత 152 దేశాల్లో తగ్గింది. పురుషుల విషయంలో 147 దేశాల్లో తగ్గింది.



కానీ, మిగతా దేశాల్లో చనిపోయే అవకాశాలు పెరిగాయి. ఈ జాబితాలో భారత్ ఒకటి.
గత దశాబ్దంలో భారత్‌లో దీర్ఘకాలిక వ్యాధుల మరణాలు పెరిగాయి. గుండె జబ్బులు, మధుమేహం ప్రధానంగా కారణమవుతున్నాయి. పురుషులతో పోలిస్తే మహిళల్లో ముప్పు మరింత ఎక్కువగా ఉంది.

**బీపీ లెక్క పక్కాగా..**
చైనా, ఈజిప్టు, నైజీరియా, రష్యా, బ్రెజిల్ వంటి దేశాల్లో మహిళలు, పురుషుల్లో దీర్ఘకాలిక వ్యాధులతో మరణాలు తగ్గాయి. భారత్, పాపువా న్యూగినీలో మాత్రం పెరిగాయి.
అనేక దేశాల్లో క్యాన్సర్, గుండె జబ్బుల మరణాలు తగ్గాయి. కానీ.. డిమెన్షియా, ఆల్కహాల్ సంబంధిత రుగ్మతలు, క్లోమ, కాలేయ క్యాన్సర్ల సమస్యలు పెరిగాయి.
దీర్ఘకాలిక వ్యాధులపై పోరాటంలో మరిన్ని పెట్టుబడుల అవసరాన్ని ఈ అధ్యయనం ప్రముఖంగా ప్రస్తావించింది. దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, కట్టడితోపాటు మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు కొత్త వ్యూహాలను రూపొందించేందుకు ప్రపంచ నేతలు ఈ నెల 25న ఐరాస జనరల్ అసెంబ్లీలో సమావేశం కానున్నారు.

# జిన్‌పింగ్ అలా.. మోదీ ఇలా..

హైదరాబాద్

రష్యా నుంచి చమురు కొనుగోలును బూచిగా చూపుతూ భారత్, చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వాత పెడుతున్నారు. అంతటితో ఆగకుండా ఈ రెండు దేశాలపై టారిఫ్‌లు విధించాలని నాటో, జీ7 దేశాలను ఉసిగొల్పుతున్నారు. ట్రంప్ చర్యలను తప్పుబడుతూ ప్రధాని మోదీ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. అయితే, చైనా మాత్రం తీవ్రంగా స్పందించింది. తమను ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శన కోసమే అమెరికా ఇటువంటి చర్యలు చేపడుతున్నదని మండిపడింది. అమెరికా చెప్పినట్టు చేస్తే, తాము కూడా ప్రతిచర్యలు చేపడుతామని నాటో, జీ7 దేశాలను హెచ్చరించింది. భారత్‌పై టారిఫ్‌లు విధించాలని నాటో, జీ7 దేశాలపై ఇటీవల ట్రంప్ ఒత్తిళ్లు తీసుకొచ్చారు. అయితే, ట్రంప్ చర్యలను ఖండిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**ట్రంప్‌పై ముప్పేట దాడి**
సుంకాల పేరిట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొంటున్న ఏక పక్ష నిర్ణయాలను తప్పుబడుతూ పలు దేశాలు ఎప్పటికప్పుడు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నాయి. బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామన్న ట్రంప్ ప్రకటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా తీవ్రంగా స్పందించారు. తమ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీగా పోల్చడంపై రష్యా కూడా ట్రంప్‌పై గట్టిగానే మండిపడింది. ఇప్పుడు నాటో, జీ7 దేశాలను తమపై ఉసిగొల్పిన ట్రంప్‌ను చైనా గట్టి హెచ్చరికలతో కట్టడి చేసింది.

**నోరు మెదపని మౌన ప్రధాని**
ట్రంప్‌కు మిగతా దేశాలు గట్టిగా బదులిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై, ఆయన విధించిన సుంకాలపై ఏ విధంగానూ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. రష్యా–భారత్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ గత నెలలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకొన్నా తనకు సంబంధం లేదన్న ట్రంప్.. ఈ క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీగా అభివర్ణించారు. ఇక, పాకిస్థాన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం గురించి చెప్తూ.. భారత్‌పై నోరు జారారు. భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించవచ్చంటూ ఊహాగానాలు చేశారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ, మోదీ ఖండించకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.

# వక్ఫ్ చట్టానికి పాక్షికంగా బ్రేక్

న్యూఢిల్లీ

కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025 చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషనర్లకు సుప్రీంకోర్టులో పాక్షిక ఉపశమనం లభించింది. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలన్న అంశంపై సిఫార్సు చేయడంతోపాటు వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చు, ఆక్రమణలకు చెందిన వివాదాలను ఎవరు పరిష్కరించాలన్న అంశాలకు సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. వక్ఫ్ చట్టంపై మొత్తంగా స్టే విధించాల్సిన అవసరం ప్రస్తుతం న్యాయస్థానానికి కనిపించడం లేదని, కొత్త చట్టంలో రాజ్యాంగపరమైన సవాళ్లకు సంబంధించి విస్తృత స్థాయిలో విచారణ జరుపుతామని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. మొత్తం చట్టాన్నే పిటిషనర్లు సవాలు చేశారని, అయితే మౌలికంగా చట్టంలోని 3(ఆర్), 3సీ, 14 సెక్షన్లను పిటిషనర్లు సవాలు చేశారని ధర్మాసనం తెలిపింది. సవాలు చేసిన సెక్షన్లపై తాము స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిబంధనను(సెక్షన్ 3(ఆర్) నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇస్లాంను ఆచరిస్తున్న వ్యక్తిని నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించే వరకు ఈ సెక్షన్‌పై స్టే విధిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ధారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ చట్టంలో పొందుపరిచిన నిబంధనపై(సెక్షన్ 3సీ(4)) కూడా ధర్మాసనం స్టే విధించింది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ఆక్రమణ ద్వారా జరిగిందీ లేనిదీ నిర్ధారిస్తూ ప్రభుత్వం నియమించిన అధికారి నివేదికను సమర్పించే వరకు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపై(సెక్షన్ 3సీ(2) కూడా కోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న నిబంధనపై(సెక్షన్ 9,14) స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని, వక్ఫ్ కౌన్సిళ్లలో నలుగురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

## హిందూమతంలో సమానత్వం ఉంటే వేరే మతంలోకి ఎందుకు మారుతారు..?

హిందువుల్లో కొందరు తమ మతాన్ని వదిలి మరో మతంలోకి మారుతుండటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ మతంలో సమానత్వం ఉంటే మరో మతంలోకి మారడమనేది ఉండదని అన్నారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'హిందూ మతంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు వేరే మతంలోకి మారతారు..?' అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. ప్రజలను మతం మారమని ఏ రాజకీయ పార్టీ కోరదని, అయినప్పటికీ మతమార్పిడులు జరుగుతున్నాయని అన్నారు. అది వారి హక్కు అని చెప్పారు. 'హిందూమతంలో సమానత్వమే ఉంటే అంటరానితనం ఇంకా ఎందుకు మిగిలి ఉంది..? అంటరానితనాన్ని మనం సృష్టించామా..? ఇస్లాం, క్రైస్తవం, ఇతర ఏ మతాల్లోనైనా అసమానత్వం ఉండొచ్చు. మేముకానీ బీజేపీకానీ ఎవరినీ మతం మారమని కోరం, ప్రజలే మతం మారుతుంటారు, అది వారి హక్కు కూడా' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. హిందువులను టార్గెట్ చేస్తూ కర్ణాటక సీఎం చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. కులం, మతం పేరుతో ప్రజలను విభజించేందుకు సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారని అసెంబ్లీలో విపక్ష నేత ఆర్ అశోక్ విమర్శించారు. అసమానత్వంపై ముస్లింలను సిద్ధరామయ్య ప్రశ్నించగలరా..? అని విమర్శించారు. దీనికిముందు బెంగళూరు శివాజీనగర్ మెట్రోస్టేషన్ పేరును సెయింట్ మేరీగా మార్చే ఒక ప్రతిపాదనకు సిద్ధరామయ్య ఆమోదం తెలిపారు. అది కూడా వివాదమైంది. సెయింట్ మేరి బాసిలికా వార్షిక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధరామయ్య.. శివాజీనగర్ మెట్రో స్టేషన్ పేరును సెయింట్ మేరీగా మారుస్తామని ఆర్చ్‌బిషప్ పీటర్ మచడోకు హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్రానికి పంపుతామని చెప్పారు. దీన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. బుజ్జగింపు రాజకీయాల కోసం మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందని విమర్శించింది.



## దేశంలోని చొరబాటుదారులను వెనక్కి పంపుతాం

పూర్ణియా: దేశంలోని చొరబాటుదారులందర్నీ తమ ప్రభుత్వం వెనక్కి పంపుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రీయ జనతా దళ్ కాంగ్రెస్ పార్టీలు రెండూ బిహార్ ఐడెంటిటీని ప్రమాదంలో పడేస్తున్నాయని విమర్శించారు. ఆర్జేడీ–కాంగ్రెస్ హయాంలో బిహార్ ఇబ్బందుల పాలైందని అన్నారు. పూర్ణియాలో సోమవారం నాడు పలు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. బిహార్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, ఆర్జేడీ ఓర్వలేకున్నాయని, అందువల్లే అనవసరమైన అంశాలను లేవనెత్తుతున్నాయని ఎద్దేవా చేశారు. అయితే బిహార్ ప్రజలు, ముఖ్యంగా మహిళలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. 'ఈ రోజు సీమాంచల్, ఈస్టర్న్ ఇండియాలో డొమోగ్రాఫిక్ సంక్షోభం తలెత్తింది. బిహార్, బెంగాల్, అస్సాం, చాలా రాష్ట్రాలు తమ ఆడకూతుళ్లు, సోదరీమణుల భద్రతపై ఆందోళనగా ఉన్నాయి. అందుకోసమే ఎర్రకోట నుంచి నేను డెమొగ్రఫీ మిషన్‌ను ప్రకటించాను. కానీ ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్, ఆర్జేడీలు చొరబాటుదారులకు కొమ్ముకాస్తూ నిస్సిగ్గుగా నినాదాలు చేస్తున్నాయి. బయట దేశాల నుంచి వచ్చిన చొరబాటుదారులను కాపాడేందుకు యాత్రలు తీస్తున్నాయి' అని మోదీ విరుచుకుపడ్డారు. సొంత కుటుంబాల గురించి మాత్రమే ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తారని, తాము మాత్రం 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'నే విశ్వసిస్తామని మోదీ చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా గణనీయంగా తగ్గిన జీఎస్టీ సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ప్రజల పొదుపు పట్ల తనకున్న చిత్తశుద్ధి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. జీఎస్టీ తగ్గింపుల కారణంగా వంటింటి ఖర్చులు చాలా వరకూ తగ్గుతాయని వివరించారు. టూత్‌పేస్ట్ నుంచి సబ్బులు, షాంపూలు, నెయ్యి, ఇతర ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయని చెప్పారు. పేద ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.



## రాష్ట్రంలో తొలి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఫిజిక్స్‌వాలా పీడబ్ల్యూ




విజయవాడ

స్థానిక గురునానక్ కాలనీ రోడ్డులో ఫిజిక్స్‌వాలా పీడబ్ల్యూ విద్యా సంస్థ ఏపీలో తొలి సమాచార కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేసింది. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఇండియా హెడ్ అమిత్ సింగ్ రాథోర్, రీజినల్ అకాడమిక్ హెడ్ సంజయ్ కుమార్ శర్మ, విజయవాడ కేంద్రం నిర్వాహకులు సుధాకర్ రెడ్డి తదితరులు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ సింగ్ రాథోర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు విద్య కూడళ్లు అని, విద్యార్థులు ఎన్నో ఆకాంక్షలతో నీట్, జేఈఈ కు సన్నద్ధం అవుతుంటారని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, వారికి కౌన్సిలింగ్ చేసేందుకు సమాచార కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశాలకు సంబంధించిన సమాచారం, నీట్, జేఈఈ పరీక్షలకు ఎలా సాధన చేయాలి అనే అంశాల పై అవగాహన కల్పించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు సమాచార కేంద్రంలో కౌన్సెలర్స్, గ్రౌండ్ టీం అందుబాటులో ఉంటారన్నారు. ఆఫ్ లైన్ విద్యాపీఠ్ సెంటర్ ను విజయవాడలో ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. నీట్, జెఇఇ ఫౌండేషన్ కోర్సులకు శిక్షణ పొందేందుకు సిద్ధం అవుతున్న ఏపీ విద్యార్థులు ఎన్ఎస్ఏటి స్కాలర్ షిప్ పరీక్షను రాసి వందశాతం ఉపకారవేతనాన్ని పొందవచ్చన్నారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయని, అక్టోబర్ లో పరీక్ష ఉంటుందని తెలిపారు. పీడబ్ల్యూ అండ్ జెవి పార్టనర్స్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ జేఈఈ, నీట్ వంటి పరీక్షలపై కౌన్సెలింగ్ పొందడాని కి విద్యార్థులు సమాచార కేంద్రాన్ని సందర్శించవచ్చన్నారు. పీడబ్ల్యూ ఇన్ఫో సెంటర్, పీడబ్ల్యూ బ్యాచ్‌ల అడ్మిషన్లు, ఆర్థిక సహాయం, రిజిస్ట్రేషన్ గురించి సమాచారం కోసం వన్–స్టాప్ గమ్యస్థానంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ వాలా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



హైదరాబాద్

మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. 2025 సెప్టెంబర్ 22న సాయంత్రం శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ 3లో 5149వ మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలు జరుగుతాయని సీఎంకు వారు వివరించారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాలను కూడా ఆయనకు ప్రతినిధి బృందం తెలిపారు. సమయం కుదిరితే ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటానని రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన వారిలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, సలహాదారులు బద్రి విశాల్ బన్సాల్, హరీష్ గుప్తా, సంజయ్ గుప్తా, యస్సావి ఉన్నారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

గన్నవరం, మహానగర్

ఎట్టకేలకు విజయవాడ రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం స్పందించింది. గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పరిరక్షించాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా స్పందించి ప్రభుత్వభూముల ఆక్రమణల నిగ్గు తెల్చేందుకు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. గత నెలలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలంలో గల తొమ్మిది గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని లేఅవుట్లలోని కామన్ సైట్లను సైతం ఆక్రమించిన ఆక్రమణదారులు క్రయ విక్రయాలు చేస్తూ అక్రమంగా డబ్బు గడిస్తున్నారని ఆరోపించారు. ఈ తొమ్మిది గ్రామాల్లోని లేఔట్లలో ఎక్కడా కామన్ సైట్ కనిపించడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఈ సమావేశంలో యార్లగడ్డ వెంకట్రావు అధికారులను కోరారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయని ఇప్పటికైనా వాటిని పరిరక్షించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. యార్లగడ్డ విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మంచి విషయాన్ని ప్రస్తావించారని కితాబిచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు విజయవాడ ఆర్డీఓ, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి, విజయవాడ రూరల్ మండలం తాసిల్దార్, ఎంపీడీవో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇల్లక్య ఉత్తర్వులు జారీ చేశారు. తన విజ్ఞప్తి మేరకు స్పందించి కమిటీని ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ లకు యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు.



# నోటీసుల వెనుక ముడుపుల మాయ టౌన్ ప్లానింగ్ కళ డ్రీమ్ వన్‌లో బహిర్గతం

- నోటీసులు జారీ.. కానీ ఫలితం శూన్యం!
- రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ హాస్టల్ నిర్మాణాలు..!
- అక్రమాలకు అండగా నిలుస్తున్న మున్సిపల్ అధికారులు..?
- టౌన్ ప్లానింగ్ శాఖకు ముడుపులు చేరేనా అన్న అనుమానాలు..?
- కట్టడాలపై చర్యలకన్నా, ముడుపుల వేటనే ప్రాధాన్యమా..?









**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంపై అవినీతి ఆరోపణలు మరింత ముదురుతున్నాయి. రింగ్ రోడ్డుకు సమీపం కావడంతో దుండిగల్ మున్సిపల్ పరిధిలో రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, అవినీతి కూడా అంతే వేగంగా పెరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజల ఆరోపణల ప్రకారం, చైన్‌మెన్, కిందిస్థాయి సిబ్బంది భారీ లంచాలు తీసుకుని ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు కట్టేలా సౌకర్యం కల్పిస్తున్నారు. గాగిలాపూర్ డ్రీమ్ వన్ కాలనీలో నిర్మాణాల పేరుతో జరుగుతున్న అక్రమాలు మరోసారి ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, అధికారులు కేవలం నోటీసులు జారీ చేశాం అంటూ తప్పించుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.అయితే ఆ నోటీసులు కేవలం కాసుల కోసమేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే, రెసిడెన్షియల్ అనుమతులు పొందిన భవనాలను కమర్షియల్ హాస్టల్స్‌గా మార్చడం, టౌన్ ప్లానింగ్ నిబంధనలను బేఖాతరు చేయడం జరుగుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం కన్నెర్ర చేయడం లేదు. నోటీసులు జారీ చేయడం ఒకవైపు%-% వాటిని అమలు చేయకపోవడం మరోవైపు. ఇది అధికారులు అక్రమ కట్టడాలకు అండగా నిలుస్తున్నారనే సంకేతమా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అదనంగా, మున్సిపల్ అధికారుల వద్దకు నోటీసులు చేరితే, వాటి వెనుక ముడుపుల బాటలోనే సద్దుమణుగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.డ్రీమ్ వన్ లో జరుగుతున్న టౌన్ ప్లానింగ్ కళ నిజంగానే నియమ నిబంధనలకా, లేక నోటీసుల రూపంలో అక్రమ ఖజానా భర్తీ చేసే మార్గానికా?

## రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికల్లో అంజయ్య - భూపతి రెడ్డి విజయం

- రాజీవ్ గృహకల్పా ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ – ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికలు
- అధ్యక్షుడిగా ధర్మారపు అంజయ్య 73 ఓట్ల ఆధిక్యంతో విజయం
- ప్రధాన కార్యదర్శిగా ముచ్చెంతల భూపతి రెడ్డి 36 ఓట్ల తేడాతో గెలుపు
- కాలనీ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని విజేతల సంకల్పం

**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం ఉత్కంఠభరిత వాతావరణంలో పోలీసుల బందోబస్తు నడుమ సజావుగా జరిగాయి.మొత్తం 1295 ఓటర్లలో 1070 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాలుగు క్యాడర్ల అభ్యర్థులు పోటీలో నిలిచిన ఈ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొని ఉత్సాహాన్ని రేకెత్తించింది.అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో ధర్మారపు అంజయ్య (బుల్లెట్ బండి గుర్తు) 373 ఓట్లు సాధించి, తన ప్రత్యర్థి గార్లపాటి ప్రభాకర్ (బొంగరం గుర్తు) పై 73 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.ప్రధాన కార్యదర్శి పదవిలో ముచ్చెంతల భూపతి రెడ్డి (లేడి గుర్తు) 385 ఓట్లు సాధించి, లక్ష్మణ్ (టీవీ గుర్తు) పై 36 ఓట్ల తేడాతో గెలుపొందారు.విజయం సాధించిన అంజయ్య మరియు భూపతి రెడ్డి మాట్లాడుతూ – "పోటీలో ఎంతమంది ఉన్నా గెలుపు ఒక్కరికి మాత్రమే దక్కుతుంది. రాజీవ్ గృహకల్ప ప్రజలు మనపై నమ్మకం ఉంచి




గెలిపించారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాలనీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతాం" అని హామీ ఇచ్చారు.ప్రధానంగా నీటి సమస్య పరిష్కారం, డ్రైనేజీ, కరెంట్, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పనలో కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా సంక్షేమ సంఘ భవనం, మహిళా సంఘ భవనం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు."కాలనీ పెద్దలు, నాయకుల సహకారంతో ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతాం" అని వారు పేర్కొన్నారు.

**- క్యాడర్ వారీగా ఓట్ల వివరాలు**

– ధర్మారపు అంజయ్య (అధ్యక్ష అభ్యర్థి) %-% 373 ఓట్లు, ముచ్చెంతల భూపతి రెడ్డి (ప్రధాన కార్యదర్శి అభ్యర్థి) %-% 385 ఓట్లు

– గార్లపాటి ప్రభాకర్ (అధ్యక్ష అభ్యర్థి) %-% 300 ఓట్లు, గుదే వెంకటేష్ (ప్రధాన కార్యదర్శి అభ్యర్థి) %-% 191 ఓట్లు

– తల్లోజు శ్రీనివాస్ ఆచారి (అధ్యక్ష అభ్యర్థి) %-% 196 ఓట్లు, లక్ష్మణ్ (ప్రధాన కార్యదర్శి అభ్యర్థి) %-% 349 ఓట్లు

– యువరాజ్ (అధ్యక్ష అభ్యర్థి) %-% 130 ఓట్లు, అరుణ్ కుమార్ (ప్రధాన కార్యదర్శి అభ్యర్థి) %-% 76 ఓట్లు

– రద్దయిన ఓట్లు: అధ్యక్షుడు %-% 70, ప్రధాన కార్యదర్శి %-% 68, మిస్సయిన ఓట్లు %- 2.

## పోక్సో కేసులో నిందితుడికి కఠిన శిక్ష

### - మెడ్చల్ కోర్టు తీర్పు

- దుండిగల్ పీఎస్ పరిధిలో 2018లో నమోదు అయిన కేసు
- నిందితుడు కొమరి శివకుమార్‌కు జీవితఖైదు, అదనంగా 10 ఏళ్ల జైలు శిక్ష
- రూ.70 వేల జరిమానా కూడా విధించిన న్యాయస్థానం



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):** మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు పోక్సో కేసులో కఠిన తీర్పు వెలువరించింది.దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో నమోదు అయిన క్రైమ్ నెంబర్. 299/2018, ఎస్ సి .నెంబర్. 912/2018 కేసులో నిందితుడు కొమరి శివకుమార్ (26), ఇందిరమ్మ కాలనీ, బౌరంపేటపై 376, 306 ఐపీసి, పోక్సో చట్టం 2012 సెక్షన్ల కింద అభియోగాలు మోపబడ్డాయి.దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణ పూర్తయి న్యాయమూర్తి ఎన్. అమరావతి తీర్పు వెలువరించారు.376 ఐపీసి , సెక్షన్ 4, పోక్సో చట్టం 2012 కింద జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.50,000 జరిమానా, ఐపీసి సెక్షన్ 306 కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20,000 జరిమానా విధించారు.ఈ కేసు దర్యాప్తును శ్రీ బి. శంకరయ్య, ఇన్‌స్పెక్టర్, దుండిగల్ పీఎస్ నిర్వహించగా, తీర్పు వివరాలను డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ వెల్లడించారు.

## సెక్యూరిటీ కార్మికులకు న్యాయం

### - నిలిచిన కార్మిక నాయకుడు రవి

- ఒక్క లక్ష ఇరవై వేల రూపాయల బకాయిలు చెల్లింపులు ఆదిత్య పెబ్సిల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ తలొగ్గింది



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):** మేడ్చల్ జిల్లా మౌలాలి ఇండస్ట్రీ ఏరియాలోని "ఆదిత్య పెబ్సిల్ ప్రైవేట్ లిమిటెడ్ సెక్యూరిటీ సర్వీసెస్" కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న మత్తుల, మున్నిలాల్, కుమార్, అజయ్, కమల్ అనే ఐదుగురు కార్మికులు వేతన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.2024 సంవత్సరానికి గాను ఈ ఐదుగురికి మొత్తం రూ. 1,20,000/- (ఒక్క లక్ష ఇరవై వేల రూపాయలు) వేతనం రావలసి ఉన్నప్పటికీ, కంపెనీ కాంట్రాక్టర్లు భీమ్ సింగ్, శ్రీ యాదవ్ నిర్లక్ష్యం వహిస్తూ చెల్లింపులు నిలిపివేశారు.తమకు న్యాయం చేయాలంటూ సెక్యూరిటీ కార్మికులు బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న రవి వెంటనే స్పందించి కంపెనీ మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపి, కార్మికులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లింపజేశారు.వేతనాలు అందుకున్న సెక్యూరిటీ గార్డులు మాట్లాడుతూ – "మాకు న్యాయం చేసిన నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము" అని ఆనందం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## "అక్రమ నిర్మాణాలకు ఆశ్రయం ప్రజా సమస్యలకు నిర్లక్ష్యం"

-ప్రజలు పిర్యాదులు ఇస్తూ అలసిపోతున్నారు – అధికారులు మాత్రం సమస్యలు పరిష్కరించరు!

- మున్సిపల్ అధికారుల ఘోర నిర్లక్ష్యం పై సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆగ్రహం
- "బుధవారం కొబ్బరికాయలు కొట్టి నిరసన" అంటూ ప్రజల హెచ్చరిక



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):** గత నెల రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ప్రాంతంలోని రోడ్లు తీవ్రంగా దెబ్బతిని ఎక్కడ చూసినా గుంతలు ఏర్పడ్డాయి. సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గత వారం ప్రజావానిలో స్థానికులు పిర్యాదు చేసినప్పటికీ, నేటికి వారం గడిచినా కనీసం ఒక్క గుంత కూడా పూడ్చకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపిస్తోంది.ఈ నేపథ్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ %-% "ప్రజలు పిర్యాదులు ఇస్తూ అలసిపోవాలి, కానీ అధికారులు మాత్రం సమస్యలను పరిష్కరించరు. మున్సిపల్ అధికారుల ఘోర నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడుతోంది" అని వ్యాఖ్యానించారు. అలాగే ఆయన ప్రశ్నిస్తూ %-% "డిప్యూటీ కమిషనర్ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా, అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా అసలు ఏమి పనులు చేస్తున్నారు? ప్రజావానిలో ఒక్క డిప్యూటీ కమిషనర్ మాత్రమే కనిపిస్తున్నారు, మిగతా అధికారులు తమకు సంబంధం లేనట్టే ప్రవర్తిస్తున్నారు" అన్నారు.
ప్రజలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ %-% "ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే, బుధవారం కొబ్బరికాయలు కొట్టి నిరసన చేపడతాం" అంటూ ఘాటైన హెచ్చరిక జారీ చేశారు.

## నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో అంబేద్కర్ భవన్ నిర్మించాలని డిమాండ్

**డీహెచ్పీఎస్, సీపీఐ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పణ**

**1.5 లక్షల ఎస్సీ ఉపకులాల ప్రజల కోసం భవనం అవసరం**

**దళితులకు పట్టా పాస్ పుస్తకాలు, ఇళ్లు కేటాయించాలని డిమాండ్**



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దళితులకు, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అవసరమైన అంబేద్కర్ భవన్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్పీఎస్), భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్%–%మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీహెచ్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. ఏసు రత్నం మాట్లాడుతూ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 1,50,000 మంది ఎస్సీ ఉపకులాల ప్రజలు నివసిస్తున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అవసరాల దృష్ట్యా అంబేద్కర్ భవన్ అత్యవసరమని తెలిపారు.అలాగే, 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన ప్రభుత్వ భూముల విషయంలో, ఇప్పటికీ భూ హక్కుల పత్రాలు అందని దళిత కుటుంబాలకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్రతి దళిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలనీ కోరారు.బాచుపల్లి మండల పరిధిలో అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటిని వెంటనే తిరిగి స్వాధీనం చేసుకుని దళితుల కోసం వినియోగించాలని సూచించారు. ఎస్సీ పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రత్యేకంగా అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయడం దళిత సమాజ అభ్యున్నతికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బక్క మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్, ఆశి. యాదయ్య, పొన్నికంటి దాస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలకు చీరల పంపిణీ

**నల్లమల్లిస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ సదభిప్రాయం**

**కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా టోకెన్ల కార్డుల ఆవిష్కరణ**

**1000 మంది మహిళలకు చీరల పంపిణీకి సిద్ధమైన ట్రస్ట్**

**నిజాంపేట రాజీవ్ గృహ కాలనీలో సెప్టెంబర్ 19న ప్రత్యేక కార్యక్రమం**



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):**

బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఆనందాన్ని పంచేందుకు నల్లమల్లిస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద స్థాయిలో చీరల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. ట్రస్ట్ ఫౌండర్ చైర్‌పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధ) ఆత్మీయంగా చేపట్టిన ఈ కార్యక్రమం సెప్టెంబర్ 19, శుక్రవారం నాడు నిజాంపేట రాజీవ్ గృహ కాలనీలో నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా 1000 మంది మహిళలకు చీరలు అందజేయనున్నారు.కార్యక్రమానికి సంబంధించిన టోకెన్ల పంపిణీ కార్డులను సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డులు విడుదల చేయగా, ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, స్రవంతి, పి. శశికళ, శశికళ, రాధిక, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ %–% “బతుకమ్మ పండుగ మన తెలంగాణ సాంస్కృతిక గౌరవానికి ప్రతీక. ఈ సందర్భంగా మహిళల కోసం నల్లమల్లిస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన చీరల పంపిణీ శుభపరిణామం. మహిళల ఆనందం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని” అభిలషించారు.

## పేదలకు సిఎంఆర్ఎఫ్ అండ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్

**షాపూర్ నగర్‌లో లబ్ధిదారులకు రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత**

**పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ నిజమైన అండ: శ్రీశైలం గౌడ్**

**ప్రజా ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందని ఎమ్మెల్యే కొనియాడారు**



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఇటీవల అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన జూల అండాలు, యార్లగడ్డ స్వరూప రాణి, అలియాబాద్ ప్రమీల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. వారికి ఈ రోజు ఆయన నివాసంలోనే చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, “సీఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత అండగా మారింది” అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు.అలాగే ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహ మార్గదర్శకత్వంలో పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని, వైద్యానికి అయ్యే ఖర్చులను సీఎంఆర్ఎఫ్ ద్వారా భరించడం పేదల కోసం పెద్ద ఉపశమనమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక

**హన్మంత్ రెడ్డి సమక్షంలో కండువా కప్పుకున్న నాయకులు**

**సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆకర్షితులైన నేతలు**

**ఆరు గ్యారెంటీలు ప్రజా ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనం: హన్మంత్ రెడ్డి- ప్రతి తెల్ల కార్డుదారునికి సన్నబియ్యం పంపిణీ**

**పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి**



**కుత్బుల్లాపూర్ ,సెప్టెంబర్ 15 (సూర్యోదయం ):**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలతో ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి చెందిన 125వ డివిజన్ దేవేందర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ నాయకులు జగన్ నాథ్, పి. శ్రీనివాస్, ఏ. సత్యనారాయణ, ఎస్. ప్రసాద్, నాగరాజు, విజయ్.జి, డి. ఆనంద్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో వీరు కండువా కప్పుకుని అధికార పార్టీలోకి అడుగుపెట్టారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ %–% “ప్రజా సంక్షేమమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోంది. ప్రతి తెల్ల కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకత. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతోంది” అని తెలిపారు.

అదేవిధంగా రేషన్ కార్డుల పంపిణీ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తున్నదని, పేదలకు అండగా నిలిచే ప్రజా ప్రభుత్వం మాత్రమే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటుందని హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా జరపాలి

**హైదరాబాద్ :** తెలంగాణ విమోచన దినోత్సవ వివరాలు భావితరాలకు తెలియాలని ఆ దిశగా ప్రభుత్వం అధికారికంగా దానిని జరపాలని మాజీ గవర్నర్ సి.ఎచ్ విద్యాసాగర్ రావు డిమాండ్ చేశారు.హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 17 సెప్టెంబర్ ముమ్మాటికీ విమోచనే పేరుతో రాసిన పుస్తకాన్ని విద్యాసాగర్ రావు విడుదల చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి 1947 లో స్వాతంత్ర్యం వచ్చిందని కానీ తెలంగాణా కు మాత్రం ఏడాది తర్వాత పోలీసు చర్యతో విమోచనం లభించిందన్నారు.దీని వివరాలు కచ్చితంగా మన ముందు తరాలకు తెలియాల్సి న అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విమోచన దినోత్సవ అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు.కొమురం భీం,షాయబుల్లా ఖాన్,సహా నాటి నేతల వివరాలు చెప్పాలన్నారు.తెలంగాణ లోని భైరన్ పల్లి,పరకాల ఘట్టాలు కూడా పుస్తకాల్లో చేరిస్తే భవిష్యత్ తరాలకు చరిత్ర తెలుస్తుందన్నారు.1998 లో తాము తొలిసారిగా విమోచన దినోత్సవ స్వర్ణోత్సవాలు జరిపమని విద్యాసాగర్ రావు తెలిపారు.ప్రభుత్వం వెంటనే అధికారికంగా విమోచన దినోత్సవ వేడుకలు జరపాలని కోరారు.

## కవితక్క నువ్వు సూపర్

**హైదరాబాద్ :** కొడంగల్ నారాయణపేట్ ఎత్తిపోతల పథకం నిర్వాసిత రైతులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలంలోని కానుకుర్తి గ్రామాన్ని జూలై 31న సందర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకం కోసం భూములు కోల్పోతున్న రైతుల పక్షాన గళమెత్తిన కవితకు రైతులు అక్షరంగా “అక్కా.. మీ వల్లనే మా భూముల పరిహారం రూ.14 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరిగింది” అంటూ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సంతకాలతో లేఖలు రాస్తూ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. వారి భూములు కోల్పోతున్న నేపథ్యంలో, తగిన నష్టపరిహారం లభించకపోతే తమ జీవితం అడుగడుగునా అస్తవ్యస్తమవుతుందని వారు వివరించారు. ఎమ్మెల్సీ కవిత రైతుల తరపున ధీటుగా నిలబడుతూ, “ఎకరానికి కనీసం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి” అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మహిళ సాధికారతే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ ఏర్పాటు

**రాజకీయ ప్రాతినిధ్యం పెంపు ప్రధాన ఉద్దేశ్యం**

**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి**

**ఇందిరా భవన్ లో ఘనంగా మహిళా కాంగ్రెస్ 41 ఆవిర్భావ వేడుకలు**

**జగిత్యాల :** మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ ఏర్పాటు జరిగిందని, మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం ప్రధాన ఉద్దేశ్యం అని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్ మహిళా కాంగ్రెస్ ఆవిర్భవించి 41 ఏళ్ళు పూర్తయినా సందర్బంగా మహిళా కాంగ్రెస్ జెండాను ఆవిషరించారు. అనంతరం మాట్లాడుతూ 1940 నుంచే మహిళా కాంగ్రెస్ ఆవిర్భావం కు అడుగులు పడ్డాయని, 1952 లో కాంగ్రెస్ పార్టీకి మహిళా విభాగం ఏర్పాటు చేయబడినప్పటికి 1983 సంవత్సరం లో ముంబయి లో జరిగిన ఏ ఐ సిసి సమావేశం లో స్వతంత్ర సంస్థగా ఏర్పాటవగా, 1984 లో బెంగుళూరు లో జరిగిన జాతీయ సమావేశం లో మహిళా కాంగ్రెస్ ఒక ఫ్రంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి ఢిల్లీ నుండి మండల, పట్టణ స్థాయికి కాంగ్రెస్ విస్తరణ జరిగిందన్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు మహిళా అభ్యున్నతీ తో పాటుగా ప్రజా సమస్యలపై అలుపెరుగనిపోరాటం చేస్తూ,మహిళా ఆరోగ్యం దిశగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి, తొలి




మహిళా ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 40 ఏళ్ల క్రితం మహిళ కాంగ్రెస్ ను ప్రారంభించారని తెలిపారు.మహిళ సాధికారత, మహిళ చైతన్యం, ఆర్థిక ప్రోత్సాహకాలు, రాజకీయాలలో ఉన్నత పదవులు మహిళలకు ఇచ్చి గౌరవించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో 33% మహిళలకు సమర్థవంతంగా వినియోగించడంతో పాటుగా, కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను మహిళలకు, నిరుపేద వర్గాల వరకు అవగాహనా కల్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం తో పాటు మహిళల ఆరోగ్యం, గౌరవం కాపాడడం పై కూడా మహిళా కాంగ్రెస్ కట్టుబడి పనిచేస్తుందని, ఇందులో భాగంగా ప్రియదర్శిని ఉడాన్ యోజన ద్వారా పేద మహిళలకు శానిటరీ న్యాప్ కిన్స్ పంపిణి చేసి, శుభ్రత అలవాట్లను ప్రోత్సాహించడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణంతక వ్యాధుల నివారనే లక్ష్యంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం, సేవా నిరతితో ముందుకు సాగుతున్న మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చెయ్యాల్సిన బాధ్యత ప్రతి సభ్యురాలిపై ఉందని, జిల్లాలో మరింత పటిష్టం కొరకు ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటును అందించాలని విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు పిప్పరి అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లాల సరిత, మేడిపల్లి మండల అధ్యక్షురాలు మ్యాదరి లక్ష్మి ,లత,రూప, సౌజన్య,తదితరులు పాల్గొన్నారు..

# ఎమ్మెల్యే మక్కాన్సింగ్ పాలన హిట్లర్ పాలనను తలపిస్తోంది.

**బిఆర్ఎస్ పార్టీ బంద్ ను నిర్వీర్యం చేసేందుకు వ్యాపారస్తులు బెదిరింపులు.**

**ప్రశ్నిస్తే కేసులు... అడిగెతే కుల్చివేతలు.**

**కమీషన్ల కోసమే కట్టాడాలు = చిరువ్యాపారులకు పక్షాన మెము పోరాడుతాం అండగా ఉంటాం.**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.**

**గోదావరిఖని:** రామగుండం లో ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ఓ నియంతలాగా వ్యవహరిస్తున్నాడు.... ఎమ్మెల్యే చేస్తున్న పాలన హిట్లర్ పాలన తరహాలో సాగుతుందని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం అడిగితే కుల్చివేతలు, కమీషన్ల కోసమే కట్టాడాల నిర్మాణాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ గారు అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నియంత నియంతృత్వ ధోరణి అద్దం పడుతుందన్నారు. లక్ష్మి నగర్ లో వ్యాపారస్తులు బెదిరింపులకు గురి చేస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన రామగుండం పారిశ్రామిక ప్రాంత బంద్ ను విఫలం చేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరిట చిరు వ్యాపారస్తుల దుకాణాలలో కూల్చి వేస్తూ వారి జీవితాలను రోడ్డుపై పడవేశారని అన్నారు. కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో, దుకాణం దారులకు ఎలాంటి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా కుల్చివేతలు చేస్తున్నరన్నారు. రోడ్డు వెడల్పు కోసం చేపడుతున్న ప్రణాళికలుఇక్కడి ప్రజలకు




వివరించాల్సిన అవసరం ప్రజాప్రతినిధి ఉందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన బంద్ కు సహకరించవద్దని లక్ష్మి నగర్ వ్యాపారస్తులు బందులో పాల్గొంటే మరో ఐదు సీట్లు భవనాలను తొలగిస్తామని చెప్పి బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. రామగుండం లో హిట్లర్ తరహ పాలన చేస్తున్న ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ప్రజల నుంచి తిరుగుబాటు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని గాంధీనగర్ లక్ష్మినగర్ , ఎన్టీపీసీలో కుల్చివేసినా దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించాలని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేసారు. బి.ఆర్.ఎస్ పార్టీ చిరు వ్యాపారులు పట్ల పోరాడుతుందని వారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు గోపు అయులయ్య యాదవ్ మాజీ కార్పోరేటర్లు గాధం విజయ కల్వచర్ల కృష్ణ వేణీ బాదె అంజలి నాయకులు బోడ్డు రవీందర్ బోడ్డుపల్లి శ్రీనివాస్ ఆర్శనపల్లి శ్రీనివాస్ మేడి సదానందం నూతి తిరుపతి మేతుకు దేవరాజ్ సట్టు శ్రీనివాస్ ముద్దసాని సంధ్యా రెడ్డి బుర్ర వెంకటేష్ వెంకటస్వామి ఇరుగురాళ్ల శ్రావన్ రాజ్ కుమార్ చింటూ కిరన్ జీ రామారాజు తదితరులు

# మన చుట్టూ పరిసరాల్లోనే ఉండే మొక్క ఇది.. పిచ్చి మొక్క అనుకుంటే పొరపాటు పడినట్లే!



మన చుట్టూ పరిసరాల్లో అనేక రకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిల్లో ఔషధ గుణాలు ఉండే మొక్కలు చాలానే ఉన్నాయి. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. వాటిని చూస్తే చాలా మంది పిచ్చి మొక్కలని అనుకుంటారు. అయితే అవి అందించే ప్రయోజనాల గురించి చాలా మందికి అవగాహన లేదు. ఇప్పుడు చెప్పబోయే మొక్క కూడా అలాంటిదే. అదే వాము మొక్క. చూసేందుకు ఇది పిచ్చి మొక్కలా ఉంటుంది. కానీ ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. అద్భుతమైన లాభాలను అందిస్తుంది. వాము మొక్క ఆకులు వాము వాసననే కలిగి ఉంటాయి. వీటిని నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వాము మొక్క పలు వ్యాధులను నయం చేస్తుందని వారు అంటున్నారు.

**జీర్ణ, శ్వాసకోశ సమస్యలకు..**

వాము మొక్క ఆకులు జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ ఆకుల్లో ఉండే పలు సమ్మేళనాలు మన జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తాయి. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను  శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. వాము ఆకుల నీళ్లను తాగడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోవడంతోపాటు కడుపు నొప్పి తగ్గుతుంది. తీవ్రమైన గ్యాస్ సమస్య ఉన్నవారికి ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలోనూ ఈ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. దగ్గు, జలుబు, ఇతర శ్వాస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారి గాలి సరిగ్గా లభిస్తుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆస్తమా, బ్రాంకైటిస్ ఉన్నవారికి సైతం మేలు జరుగుతుంది.

**రోగ నిరోధక శక్తికి..**

వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల వాము ఆకులను పేస్ట్‌లా చేసి చర్మంపై రాస్తుంటే చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. గజ్జి, తామర వంటి చర్మ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వాము ఆకుల్లో ఉండే మినరల్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. చిన్నారులకు సైతం ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**దంతాలు, చిగుళ్ల సమస్యలకు..**

వాము ఆకులను నోట్లో వేసుకుని నమిలితే ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఆకుల్లో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు నోట్లో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల నీళ్లను తాగుతుంటే బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ ఆకుల నీళ్లను సేవిస్తే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. వాము ఆకులను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. లేదా ఈ ఆకుల జ్యూస్‌ను కాస్త తీసి దాన్ని కొద్దిగా తేనెతో కలిపి తీసుకోవచ్చు. చర్మంపై పూతగా ఉపయోగించవచ్చు. లేదా మీరు రోజూ చేసుకునే కూరల్లో, ఇతర వంటల్లోనూ వేయవచ్చు. ఇలా ఈ ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు.

# రోజూ దాల్చిన చెక్క పాలను తాగడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..?

**తెలిస్తే వెంటనే తాగడం ప్రారంభిస్తారు..!**



దాల్చిన చెక్కను మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తుంటాం. బిర్యానీ, పులావ్ వంటి వంటకాలతోపాటు మసాలా వంటల్లో దాల్చిన చెక్కను వేస్తుంటారు. దీంతో వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. దాల్చిన చెక్క ఘాటుగా ఉంటుంది. కనుక వంటల్లో వేస్తే కాస్త కారంగా అనిపిస్తుంది. అందుకని దాల్చిన చెక్కను కేవలం వంటల్లోనే వేస్తుంటారు. నేరుగా తినరు. అయితే దాల్చిన చెక్కను తీసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఇందులో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. దాల్చిన చెక్కను తీసుకుంటే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కానీ ఘాటుగా ఉంటుంది కాబట్టి దీన్ని నేరుగా తినలేరు. అయితే రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కాస్త దాల్చిన చెక్క పొడిని కలిపి తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

**డయాబెటిస్‌కు..**

దాల్చిన చెక్క పాలను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ అనే సమస్య ఉన్నవారికి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్క పాలను తాగుతుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దాల్చిన చెక్క వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. టైప్ 2 డయాబెటిస్ లేదా ప్రీ డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. రాత్రి పూట దాల్చిన చెక్క పాలను సేవిస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

దాల్చిన చెక్క పాలను సేవిస్తే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. పాలలో, దాల్చిన చెక్కలో ఉండే అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాగే ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి. పాలలో క్యాల్షియం అధికంగా ఉంటుంది. కనుక దాల్చిన చెక్క పొడి కలిపిన పాలను తాగుతుంటే శరీరానికి క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే దాల్చిన చెక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**బరువు తగ్గేందుకు..**

దాల్చిన చెక్క పాలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అధిక బరువును తగ్గించుకోవచ్చు. శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు ఈ పాలను రోజూ సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. అయితే కొవ్వు తీసిన పాలను తాగాల్సి ఉంటుంది. దాల్చిన చెక్క పాలలో సినమాల్డిహైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. కనుక శరీరం లోపల, బయట ఉండే వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి బయట పడవచ్చు. ఇలా దాల్చిన చెక్క పాలను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే గర్భిణీలు, అలర్జీలు ఉన్నవారు, రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు, లివర్ సమస్యలు ఉన్నవారు మాత్రం ఈ పాలను తాగకూడదు.

# మటన్ లివర్‌ను తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా?



ఆదివారం వస్తే చాలా మంది నాన్ వెజ్ ప్రియులు ఏ నాన్ వెజ్ వంటకాన్ని తిందామా.. అని ఆలోచిస్తుంటారు. ఈ క్రమంలోనే కొందరు చికెన్ తింటే కొందరు మటన్ తింటారు. ఇంకొందరు చేపలు, రొయ్యలను తింటారు. అయితే మటన్ విషయానికి వస్తే అందులో చాలా వెరైటీలు ఉంటాయి. వాటిల్లో మటన్ లివర్ కూడా ఒకటి. మటన్ లివర్‌ను చాలా మంది నాన్ వెజ్ ప్రియులు ఇష్టంగా తింటారు. అయితే మటన్ లివర్ అనేక పోషకాలను కలిగి ఉంటుందని, దీన్ని పోషకాలకు గనిగా భావించవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మటన్ లివర్‌ను ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది నాన్ వెజ్ ప్రియులు ఇష్టంగా తింటారు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. దీన్ని తింటే అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

మటన్ లివర్‌లో పోషకాల శాతం అధికంగా ఉంటుంది. హై క్వాలిటీ ప్రోటీన్లు ఇందులో ఉంటాయి. ఇవి కణజాల మరమ్మత్తులకు దోహదం చేస్తాయి. శరీర జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేలా చూస్తాయి. మటన్ లివర్‌లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. మటన్ లివర్‌లో ఐరన్ అధిక మొత్తంలో ఉంటుంది. కనుక లివర్‌ను తింటే శరీరానికి ఐరన్ అధికంగా లభిస్తుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తక్కువగా ఉన్నవారు మటన్ లివర్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. దీని వల్ల నీరసం, అలసట తగ్గుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. మటన్ లివర్‌లో విటమిన్ ఎ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. కణాల వృద్ధికి, మరమ్మత్తులకు దోహదం చేస్తుంది.

**గర్భిణీలకు మేలు..**

మటన్ లివర్‌లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి12, విటమిన్ బి9 అధికంగా ఉంటాయి. విటమిన్ బి12 నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో మెడ, భుజాల భాగాల్లో వచ్చే నొప్పి తగ్గిపోతుంది. విటమిన్ బి12 వల్ల ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో రక్తహీనత తగ్గుతుంది. మటన్ లివర్‌లో ఉండే ఫోలేట్ కణజాల నిర్మాణానికి సహాయం చేస్తుంది. గర్భిణీలకు ఇది ఎంతో మేలు చేస్తుంది. శిశువు ఎలాంటి పుట్టుక లోపాలు లేకుండా జన్మించేందుకు గాను సహాయ పడుతుంది. మటన్ లివర్‌లో కాపర్ అధికంగా ఉంటుంది. ఇది శరీర మెటబాలిజంను మెరుగు పరుస్తుంది. మనం తినే ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. శరీరంలో శక్తి పెరిగేలా చేస్తుంది. నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

# పర్పుల్ రంగు క్యారెట్లను తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..? ఆశ్చర్యపోతారు..!

క్యారెట్లు అనగానే మనకు చూడచక్కని ఆకర్షణీయమైన నారింజ రంగు గుర్తుకు వస్తుంది. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. వీటితో ఎన్నో వంటకాలను కూడా తయారు చేస్తుంటారు. క్యారెట్లతో కూరలను కూడా చేస్తుంటారు. పలు వంటల్లోనూ వీటిని ఉపయోగిస్తుంటారు. క్యారెట్లను పచ్చిగా తినవచ్చు. లేదా జ్యూస్ తయారు చేసి తాగవచ్చు. క్యారెట్లను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అయితే క్యారెట్లలోనూ పలు రకాలు ఉంటాయి. సాధారణంగా మనం నారింజ రంగులో ఉండే క్యారెట్లను వాడుతాం. కానీ పర్పుల్ కలర్ క్యారెట్లు కూడా మనకు లభిస్తాయి. అయితే వీటిని జన్యుపరంగా పండించిన క్యారెట్లుగా పొరపాటుపడుతుంటారు. కానీ నారింజ రంగు క్యారెట్లలాగే పర్పుల్ రంగు క్యారెట్లు కూడా సహజసిద్ధమైనవే. ఇవి జన్యుపరంగా అభివృద్ధి చేయబడినవి కావు. అందువల్ల పర్పుల్ రంగు క్యారెట్లను కూడా ఎలాంటి భయం లేకుండా తినవచ్చు. వీటిని తింటున్నా కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

**పోషకాలు అధికం..**

పర్పుల్ రంగు క్యారెట్లలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఫైబర్, పొటాషియం, విటమిన్లు కె, బి6, సి అధికంగా ఉంటాయి. పర్పుల్ రంగు క్యారెట్లలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. అందుకనే ఈ క్యారెట్లు పర్పుల్ రంగులో ఉంటాయి. ఇవే యాంటీ ఆక్సిడెంట్లు బ్లూబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, పర్పుల్ రంగు క్యాబేజీలోనూ ఉంటాయి. కనుక పోషకాల విషయంలో ఈ ఆహారాలన్నీ ఒకే స్థాయిలో ఉంటాయని చెప్పవచ్చు. ఇక పర్పుల్ రంగు క్యారెట్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పర్పుల్ రంగు క్యారెట్లలో కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవి మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతాయి. దీని వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.


**అధిక కొలెస్ట్రాల్ ఉంటే..**

పర్పుల్ రంగు క్యారెట్లలో ఉండే ఆంథో సయనిన్స్, ఫినోలిక్ సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. అందువల్ల ఈ క్యారెట్లను తింటే కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. పర్పుల్ రంగు క్యారెట్లను తినడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారికి ఈ క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. పర్పుల్ రంగు క్యారెట్లలో ఉండే ఆంథో సయనిన్స్ గ్లూకోజ్ మెటబాలిజంను క్రమబద్దీకరిస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**మెదడు**

**ఆరోగ్యానికి..**

పర్పుల్ రంగు క్యారెట్లను తింటే కంటి చూపు మెరుగు పడడమే కాదు, మెదడు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా మారి యాక్టివ్‌గా పనిచేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. బద్దకం పోతుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు ఈ క్యారెట్లను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా ఈ క్యారెట్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. పర్పుల్ రంగు క్యారెట్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, బీటాకెరోటిన్‌లు చర్మాన్ని సంరక్షిస్తాయి. సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఇలా పర్పుల్ రంగు క్యారెట్లను తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.



## బిజినెస్

### జియో బ్లాక్‌రాక్ తొలి ఫండ్..




జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ తొలి యాక్టివ్ ఈక్విటీ ఫండ్ 'జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్' న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో) ఈ నెల 23న ప్రారంభం కానుంది. "ఇది మాకు తొలి యాక్టివ్ ఫండ్ అవుతుంది. మరో మూడు నాలుగు యాక్టివ్ ఈక్విటీ ఫండ్స్ కూడా త్వరలో రానున్నాయి. ఈటీఎఫ్‌లను సైతం తీసుకొస్తాం"అని జియోబ్లాక్‌రాక్ ఏఎంసీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రిషి కోహ్లీ ప్రకటించారు. అంతర్జాతీయంగా నిరూపితమైన ఎస్‌ఏఈ ప్లాట్‌ఫామ్‌పై దీన్ని నిర్మించామని, 400 సంకేతాల ఆధారంగా, టెక్నాలజీ సాయంతో పెట్టుబడులు పెట్టనున్నట్టు, దీనివల్ల వ్యక్తుల ప్రమేయానికి సంబంధించి రిస్క్ తగ్గుతుందని జియోబ్లాక్‌రాక్ తెలిపింది. నష్టాల రిస్క్‌ను పరిమితం చేయడం, స్థిరమైన రాబడిని తెచ్చిపెట్టడం జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ లక్ష్యమని పేర్కొంది. జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ అన్నది జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ ఆధ్వర్యంలోని జాయింట్ వెంచర్ కంపెనీ కావడం గమనార్హం.

### స్పైస్‌జెట్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపుల్లో ఆలస్యం..!




ప్రముఖ చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తన ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో మరోసారి జాప్యం చేస్తోంది. రూ.55,000 వరకు వేతనం కలిగిన జూనియర్ ఉద్యోగులు ఆగస్టు నెలకు సంబంధించి జీతం టైమ్‌కు అందుకోగా.. సీరియర్ సిబ్బంది ఆలస్యంగా జీతాలు అందుకుంటున్నట్లు సమాచారం. కొందరికీ ఇప్పటికీ జీతాలు అందలేదని తెలిసింది. సీనియర్ సిబ్బంది ముఖ్యంగా అసిస్టెంట్ మేనేజర్ స్థాయి, అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉన్న వారికి కనీసం 10-15 రోజులు ఆలస్యంగా వేతనాలు అందుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై సంస్థ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గత ఆర్థిక సంవత్సరం స్పైస్‌జెట్ వార్షిక నివేదిక ప్రకారం, సంస్థలో 4,894 మంది శాశ్వత సిబ్బందితో సహా మొత్తం 6,484 మంది ఉద్యోగులు ఉన్నారు. కాగా, గతంలో ఈ సంస్థ అనేకసార్లు తమ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

# అమెరికాలో ఖరీదైన ఇంటిని కొనుగోలు చేసిన ముకేశ్ అంబానీ

భారత దిగ్గజ పారిశ్రామిక వేత్త, ఆసియాలోనే అత్యంత సంపన్నుడుగా పేరుగాంచిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ గురించి ఒక వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అంబానీకి ప్రపంచవ్యాప్తంగా ఖరీదైన ఆస్తులు, విలాసవంతమైన ఇల్లు ఉన్న విషయం తెలిసిందే. అమెరికా, దుబాయ్ సహా పలు ప్రధాన నగరాల్లో రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. తాజాగా ఆయన అగ్రరాజ్యం అమెరికాలో ఓ ఇంటిని కొనుగోలు చేసినట్లు సమాచారం. న్యూయార్క్ నగరంలో అత్యంత విలాసవంతమైన ఇంటిని ముకేశ్ అంబానీ కొనుగోలు చేసినట్లు తెలిసింది. ట్రైబెకా ప్రాంతంలో టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరాకు చెందిన ఈ ఇంటిని 17.4 మిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్నారు. భారత కరెన్సీ ప్రకారం దాని విలువ రూ.153 కోట్లు అని సమాచారం. ఈ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాపర్టీని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అమెరికా విభాగం కొనుగోలు చేసినట్లు



సమాచారం. కాగా, ముకేశ్ అంబానీ రెండేండ్ల క్రితం న్యూయార్క్ లోని మాన్‌హట్టన్‌లో విలాసవంతమైన ఇంటిని విక్రయించిన విషయం తెలిసిందే. మాన్‌హట్టన్ వెస్ట్ విలేజ్‌లో గల హడ్సన్ నదీ తీరాన అపార్ట్‌మెంట్‌లోని నాలుగో ఫ్లోర్‌లో 2,406 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ లగ్జరీ ఇంటిని అంబానీ 9 మిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.74.5 కోట్లు) విక్రయించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ ఇంటిని విక్రయించిన రెండేళ్లకే న్యూయార్క్ నగరంలోనే మరో లగ్జరీ ఇంటిని అంబానీ కొనుగోలు చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ భవంతిని టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో దాదాపు 20 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. దాన్ని లగ్జరీ హెూమ్‌గా అభివృద్ధి చేయాలని భావించారు. కానీ ఆ ప్రణాళికలు కార్యరూపం దాల్చకపోవడంతో దాన్ని అమ్మేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 2021లో 25 మిలియన్ డాలర్లకు ఆ ఇంటిని విక్రయానికి పెట్టారు. తాజాగా, ముకేశ్ అంబానీ కుటుంబం ఈ భవంతిని సొంతం చేసుకుంది.

# కళ్లజోడుకు గుడ్‌బై? సర్జరీ లేకుండా.. రెండేళ్లు!

వయసు పెరిగే కొద్దీ.. దాదాపు అందరికీ ప్రెస్బయోపియా (కంటిచూపు లోపం) వస్తుంది. అప్పుడు చదవడం లేదా ఫోన్‌ను ఉపయోగించడం వంటి క్లోజప్ విషయాలపై దృష్టి పెట్టడం కొంత కష్టతరమవుతుంది. దీనికోసం రీడింగ్ గ్లాసెస్‌పై ఆధారపడతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశోధకులు ప్రత్యేక కంటి చుక్కలను కనుగొన్నారు. ఇది కొంతకాలం పాటు గ్లాసెస్‌ను వదిలించుకోవడానికి సహాయపడుతుందని చెబుతున్నారు.

**రెండేళ్ల పాటు మెరుగైన దృష్టి**

రెండు సంవత్సరాల పాటు జరిగిన ఒక అధ్యయనంలో.. కంటి చుక్కలను కనుగొన్నారు. వీటిని రోజుకు రెండు లేదా మూడు సార్లు ఉపయోగించడం వల్ల, కళ్లజోడుతో పనిలేకుండానే చిన్న అక్షరాలను చదివే సామర్థ్యం మెరుగుపడిందని తేలింది. అధ్యయనంలో.. చాలా మంది వ్యక్తులు చుక్కలను ఉపయోగించిన తర్వాత ప్రామాణిక కంటి చార్టులో (జేగర్ చార్ట్) రెండు లేదా అంతకంటే ఎక్కువ అదనపు పంక్తులను చదవగలిగారు. ఈ చుక్కలను ఉపయోగించడం వల్ల.. రెండేళ్ల పాటు మెరుగైన దృష్టిని పొందవచ్చని చెబుతున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన ఫలితాలు యూరోపియన్ సొసైటీ ఆఫ్ క్యాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్స్‌లో ప్రచురించారు. కంటి చూపు పెరగడానికి ఉపయోగించే.. చుక్కల మందులో పైలోకార్పైన్ (కన్ను దగ్గరగా ఉన్న వస్తువులపై దృష్టి పెట్టడానికి సహాయపడుతుంది), డైక్లోఫెనాక్ (కొంతమందికి కలిగే చికాకును నివారించడంలో సహాయపడుతుంది) ఉపయోగించినట్లు వెల్లడించారు.

**రోజుకు రెండుసార్లు**

సాధారణంగా ప్రజలు.. రోజుకు రెండుసార్లు చుక్కలను ఉపయోగిస్తారు. అవసరమైతే మూడవ మోతాదును కూడా ఉపయోగించుకోవచ్చు.




ప్రెస్బియోపియా ప్రభావాన్ని బట్టి.. రోజుకు ఎన్నిసార్లు ఉపయోగించాలనేది నిర్ధారించడం జరుగుతుంది. ప్రెస్బియోపియా తీవ్రత తక్కువగా ఉంటే తక్కువసార్లు, ఎక్కువగా ఉన్నప్పుడు మంచి రిజల్ట్స్ కోసం ఎక్కువసార్లు ఉపయోగించాల్సి ఉంటుంది. కంటి చూపు మందగించడం వల్ల.. కొంతమంది ఆపరేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపరేషన్ వద్దనుకుని, సరళమైన పద్ధతిలో సమస్య పరిష్కరించుకోవడానికి ఈ చుక్కల మందు ఉపయోగపడుతుంది. అయితే ప్రెస్బియోపియా ప్రభావం తగ్గించడానికి ఉపయోగించే చుక్కల మందు వల్ల.. స్వల్ప చికాకు లేదా తేలికపాటి తలనొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమస్యలను నిర్మూలించడానికి మరింత అధ్యయనం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# షేక్‌హ్యాండ్ ఇవ్వని టీమిండియా క్రికెటర్లు.. నిరసన వ్యక్తం చేసిన పాకిస్థాన్

**దుబాయ్ :** ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ ఘటన తర్వాత రెండు దాయాది దేశాలు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లు .. పాకిస్థాన్ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు నిరాసక్తత ప్రదర్శించారు. దీన్ని పాకిస్థాన్ జట్టు ఖండించింది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ముందు తన నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఆలస్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దీనిపై ప్రకటన రిలీజ్ చేసింది. టీమిండియా చర్యలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన ్నట్లు పీసీబీ ఆ స్టేట్మెంట్‌లో చెప్పింది. ఆదివారం దుబాయ్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్, పాక్ కెప్టెన్లు టాస్ సమయంలో షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. సూర్యకుమార్ యాదవ్, సల్మాన్ ఆఘాలు.. క రచాలనం చేయకుండానే టాస్‌లో పాల్గొని వెళ్లిపోయారు. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత టీమిండియా క్రికెటర్లు సైలెంట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. టార్గెట్ 128 చేసే క్రమంలో భారీ సిక్సర్‌తో సూర్య ఇన్నింగ్స్ ముగించేశాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత సాధారణంగా ప్రత్యర్థి జట్ల ప్లేయర్లకు షేక్‌హ్యాండ్ ఇస్తారు. కానీ సూర్య, దూబేలు.. పాక్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. గెలిచిన, ఓడిన జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు.




భారత క్రికెటర్లు ప్రవర్తించిన తీరు పట్ల పాకిస్థాన్ టీమ్ మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం అని ఆయన అన్నారు. నిరసనలో భాగంగా తమ కెప్టెన్ను పోస్టు మ్యాచ్ సెర్మనీకి పంపలేదని ఆయన స్టేట్మెంట్‌లో తెలిపారు. పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం పట్ల మ్యాచ్ తర్వాత సూర్యకుమార్ స్పందించారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

### 'అలా ఎక్కడా రాసి లేదు'.. షేక్‌హ్యాండ్‌పై పాక్‌కు బీసీసీఐ స్ట్రాంగ్ కౌంటర్

ఆసియాకప్-2025లో ఆదివారం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో టీమిండియా విజయభేరి మ్రోగించింది. అయితే ఈ మ్యాచ్ టాస్ సందర్భంగా గానీ, ఆట ముగిశాక కానీ భారత జట్టు ఆటగాళ్లు పాకిస్తాన్ ప్లేయర్లతో కరచాలనం చేసేందుకు ఇష్టపడలేదు. ఎటువంటి కరచాలనాలు, పలకరింపులు లేకుండా తమ పని తాము చేసుకుని మైదానం వీడారు. పెహల్గమ్ ఉగ్రదాడికి నిరసనగా ఇండియన్ టీమ్ మెనెజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఒకవేళ సూపర్-4లో మరోసారి పాక్‌తో తలపడితే సూర్య అండ్ కో ఇదే పద్ధతిని కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ది ఎకనామిక్ టైమ్స్ ప్రకారం.. బీసీసీఐ నుంచి అనుమతి లభించిన తర్వాతే పాక్ ఆటగాళ్లతో హ్యాండ్ షేక్‌చేయకూడదనే నిర్ణయాన్ని టీమిండియా తీసుకుందంట. అయితే భారత ఆటగాళ్లు తమతో కరచాలనం చేయకపోవడంపై పాకిస్తాన్ టీమ్ అసహనం వ్యక్తం చేసింది.




ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని, భారత జట్టు తీరుపై ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసేందుకు పాకిస్తాన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పాకిస్తాన్‌కు బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు గట్టి కౌంటరిచ్చారు. పాక్ ఫిర్యాదు చేసిన అది చెల్లదు అని ఆయన తెలిపారు. "మీకు ఏదైనా సందేహం ఉంటే ఒక్కసారి రూల్ బుక్‌ను చదవండి. అందులో ఎక్కడ కూడా ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వాలని ప్రత్యేకంగా ఏమీలేదు. అది కేవలం మర్యాదపూర్వకమైన సంజ్ఞ మాత్రమే. షేక్ హ్యాండ్స్ ఇవ్వాలా లేదా అన్నది వారి సొంత నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. అంతే తప్ప ప్రత్యేకంగా చట్టం ఏమీ లేదు. కాబట్టి ఇండియన్ క్రికెట్ టీమ్ ప్రత్యర్థి జట్టుతో కరచాలనం చేయకపోయిన అదేమి పెద్ద నేరం కాదు" అని సదరు అధికారి పీటీఐతో పేర్కొన్నారు.

## స్పోర్ట్స్

### అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన సౌరవ్ గంగూలీ



భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ బాస్ సౌరవ్ గంగూలీ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. 2015%-%2019 మధ్యకాలంలో తొలిసారి ఈ పదవిని నిర్వహించిన ఆయన.. ఇప్పుడు రెండోసారి క్యాబ్ బాస్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. తన అన్న స్నేహాశిష్ గంగూలీ స్థానాన్ని సౌరవ్ భర్తీ చేయనున్నారు. గంగూలీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ పదవి కొసం ఇతరులెవ్వరూ నామినేషన్లు వెయ్యలేదు. ఇతరులెవ్వరైనా నామినేషన్లు వేసి ఉంటే అధ్యక్ష ఎన్నిక సెప్టెంబర్ 22న జరిగేది. గంగూలీ ప్యానెల్‌లో నితీష్ రంజన్ దత్తా ఉపాధ్యక్షుడిగా, బబ్లు కోలే కార్యదర్శిగా, మదన్‌మోహన్ ఘోష్ సహాయ కార్యదర్శిగా, సంజయ్ దాస్ ట్రెజరర్‌గా ఉంటారు. రెండో సారి క్యాబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత గంగూలీ మాట్లాడుతూ ఇలా అన్నాడు. చాలా ఆనందంగా ఉంది. మరోసారి క్యాబ్ కుటుంబంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. క్యాబ్ ఓ కుటుంబం లాంటిది. ఇక్కడ ఎలాంటి ప్రతిబంధకాలు లేవు.

త్వరలో ఈడెన్ గార్డెన్స్‌లో జరగబోయే ఇండియా-సౌతాఫ్రికా టెస్ట్ మ్యాచ్‌పై దృష్టి పెడతాను. అలాగే టీ20 వరల్డ్‌కప్, బెంగాల్ ప్రో టీ20 లీగ్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తాను. మిగతా సభ్యుల సహకారంతో బెంగాల్ క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్తాను. ఇదిలా ఉంటే, గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా కూడా మరోసారి ఎన్నికవుతారని టాక్ నడుస్తుంది. క్యాబ్ గంగూలీని తమ ప్రతినిధిగా ఏజీఎంకు నామినేట్ చేయడంతో ఈ ప్రచారం మొదలైంది. ఏజీఎంకు నామినేట్ కావడం వల్ల గంగూలీ బీసీసీఐ అధ్యక్ష రేసులో ఉంటాడు. గంగూలీ 2019-2022 మధ్యలో బీసీసీఐ బాస్‌గా వ్యవహరించాడు. తాజా మాజీ అధ్యక్షుడు రోజర్ బిన్నీ దిగిపోవడంతో సెప్టెంబర్ 28న ఎన్నిక జరుగనుంది. ఈ పదవికి సెప్టెంబర్ 20, 21 తేదీల్లో నామినేషన్లు వేస్తారు.




## డైలామాకు చెక్.. సుధీర్ బాబు జటాధర థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్ బాబు ఈ టాలెంటెడ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈ మూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టుకున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.



## రామ్ చరణ్ పెద్ది సినిమాపై క్రేజీ అప్‌డేట్.. దసరాకి మెగా ట్రీట్ ప్లాన్ చేస్తున్న మేకర్స్

'గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు.ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది.రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026, మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. మరోవైపు దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.

## దుల్కర్ సల్మాన్ DQ 41లో బాహుబలి స్టార్.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?




మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ ఇటీవలే కొత్త తెలుగు సినిమాను ప్రకటించాడని తెలిసిందే. DQ41 (వర్కింగ్ టైటిల్)తో వస్తోన్న ఈ సినిమాను టాలీవుడ్ లీడింగ్ బ్యానర్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో పొడుగుకాళ్ల సుందరి పూజాహెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని ఇటీవలే ప్రకటించారు మేకర్స్. కాగా మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. బాహుబలి స్టార్ రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. రమ్యకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ విషయాన్ని ప్రకటించారు. బాహుబలి ఫ్రాంచైజీలో శివగామి లాంటి పవర్ ఫుల్ రోల్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది రమ్యకృష్ణ. ఇంతకీ రమ్యకృష్ణ ఈ ప్రాజెక్టులో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ మూవీతో రవి నేలకుడిటి డైరెక్టర్‌గా పరిచయమవుతున్నాడు. ప్రస్తుతం DQ41 షూటింగ్ దశలో ఉంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ ఇటీవలే విడుదలైన లోక చాప్టర్ 1 బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. కాగా ఈ బ్యానర్‌లో ప్రస్తుతం నాని నటిస్తోన్న ది ప్యారడైజ్ కూడా ఉంది.



## తేజ సజ్జా లైనప్ మామూలుగా లేదుగా.. మిరాయ్ సక్సెస్ తర్వాత మరింత దూకుడు పెంచాడుగా..!

ఎయంగ్ హీరో తేజ సజ్జా నటించిన తాజా పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. రేట్లు పెంచకుండానే, ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.27.20 కోట్లు, రెండో రోజు రూ.28.40 కోట్లు వసూలు చేసి, రెండు రోజుల్లోనే రూ.55.60 కోట్ల క్లబ్‌లోకి దూసుకెళ్లింది. స్టార్ హీరోలు సాధించలేని రేంజ్‌లో ఓ యంగ్ హీరో సినిమా ఇలాంటి కలెక్షన్స్ సాధించడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఇక తేజ సజ్జా 'హనుమాన్'తో పాన్ ఇండియా రేంజ్‌ను టచ్ చేసి, రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'మిరాయ్'తో ఆ రికార్డుల్ని తిరగరాయాలని భావిస్తున్నాడు. ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రం దుమ్మురేపుతోంది. అమెరికాలో మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరింది. అక్కడ థియేటర్ల సంఖ్య కూడా పెంచుతున్నారు. ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం, ఈ వీకెండ్ ముగిసేలోపు %వి%1.5 మిలియన్ మార్క్ దాటే ఛాన్స్ ఉంది. ఈ సినిమా థియేట్రికల్ రైట్స్‌ను సాధారణ ధరలకే అమ్మిన నిర్మాతలు, నాన్ థియేట్రికల్ హక్కుల ద్వారానే రూ.20 కోట్లకు పైగా లాభాలు ఆర్జించారు. దీంతో బ్రేక్ ఈవెన్ టార్గెట్ బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరూ టెన్షన్ పడాల్సిన పరిస్థితి లేదు. ఏపి, తెలంగాణలో సోమ, మంగళవారాల్లోనే బ్రేక్ ఈవెన్ దాటేసి లాభాల్లోకి వెళ్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు వరుస బ్లాక్‌బస్టర్లతో (హనుమాన్, మిరాయ్) తేజ సజ్జా క్రేజ్ భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్టులపై పూర్తి దృష్టి పెట్టాడు. 'జాంబీ రెడ్డి 2' కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తేజ, 'మిరాయ్ 2' కూడా చేయనున్నాడు. ఈ మూవీ స్క్రిప్ట్ పనులు ప్రారంభమయ్యాయి ఈ రెండు పూర్తైన తర్వాత 'జై హనుమాన్' అనే భారీ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు సమాచారం. లవ్ స్టోరీలు, రొమాంటిక్ డ్రామాల్ని పక్కనబెట్టి, తేజ ఫాంటసీ, అడ్వెంచర్, డివోషనల్ థీమ్‌లపై దృష్టి పెట్టడం ఫిల్మ్ నగర్‌లో చర్చనీయాంశంగా మారింది. కొత్త హీరోగా తన మార్క్‌ను ప్రూవ్ చేసుకున్న తేజ సజ్జా, ఇప్పుడు స్టార్ స్టేటస్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాడు.

## అందరూ గలీజ్ అయిపోయారు.. కమిట్‌మెంట్స్ అడిగారు, డిప్రెషన్..



డ్యాన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న నైనిక అనసురు (%చీఱఅఱaఖి ాఅaుంబతీబ%) తెలుగు బిగ్‌బాస్ ఎనిమిదో సీజన్‌లోనూ పాల్గొంది. టాస్కుల్లో బాగానే పర్ఫామ్ చేసినప్పటికీ ఫినాలే వరకు వెళ్లలేకపోయింది. కవర్ సాంగ్స్‌తో అలరిస్తున్న ఈ బ్యూటీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాలను, కెరీర్‌లో అనుభవించిన బాధలను పంచుకుంది. నైనిక మాట్లాడుతూ.. 'ఢీ షో చేస్తున్న సమయంలోనే నేను డిప్రెషన్‌కు గురయ్యాను. నా ఫ్యామిలీతో సహా ఎవరూ నా ఫీలింగ్స్ అర్థం చేసుకోలేదని బాధపడ్డాను. ఇంట్లోవాళ్లు పాతకాలం మనుషుల్లా ఆలోచించేవారు. వేధింపులను కూడా కొంతవరకు భరించాలన్నట్లుగా చెప్పేవారు. కానీ, అది నా వల్ల కాదు. ఎవర్నీ ఏమీ అనలేక, ఏం చేయలేక పది మంది ముందు నన్ను నేనే తిట్టుకుని ఏడ్చేదాన్ని. ఎందుకిలా అయిపోతున్నానో అర్థం కాలేదు. చనిపోయేందుకు ప్రయత్నించాను. దాదాపు ఏడాదిపాటు బాధపడుతూ నా జీవితాన్ని వృథా చేసుకున్నాను. కానీ, దానివల్లే నన్ను నేను ఎంత ప్రేమించుకోవాలో తెలిసొచ్చింది. ఇకపోతే ఇండస్ట్రీలో అందరూ నిలదొక్కుకోలేరు. నిజాయితీగా మాట్లాడాలంటే నాకు ఓ కూతురుంటే తనను ఈ ఇండస్ట్రీకి అస్సలు పంపించను. వద్దని చెప్పేస్తా! ఇండస్ట్రీలో చాలా చీకటికోణాలున్నాయి. అవన్నీ ఇప్పుడు సర్వసాధారణమైపోయాయి. కాస్టింగ్ కౌచ్‌లాంటివి ఫేస్ చేశాను. కొందరు డైరెక్ట్‌గా కాల్ చేసి మరీ అడుగుతుంటారు. సినిమా ఆఫర్లు ఇచ్చి కమిట్‌మెంట్స్ అడిగారు. అందరూ గలీజ్ అయిపోయారు. ఈ మధ్య నాకు ఓ రియల్ ఎస్టేట్ గ్రూప్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. బ్రాండ్ ప్రమోషన్ కోసం అనుకున్నా.. కాదు, పర్సనల్ అన్నారు. ఆయనేమంటున్నారో అర్థం కాకపోయినా డీల్ ఏంటో చెప్పండి అన్నాను. అందుకతడు.. మీ గురించి బయట ఓ ప్రచారం జరుగుతోంది. మీకు ఓ రేట్ ఫిక్స్ చేస్తున్నారు. మీ ఫోటోలతో పాటే ఆ రేట్స్ కూడా సర్క్యులేట్ చేస్తున్నారు అన్నాడు. దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు.. ఈ ఇండస్ట్రీ ఎంతో దరిద్రంగా తయారైందనేది! అని నైనిక బాధపడింది.

Printed by , Published by LN Media and owned by SHIVA KRISHNA , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line Hyd-500013 TS.
Published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: D Shiva krishna. cell : 95738 22884